ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఆగస్టు 8, 2010

పదాల పదనిసలు

హ్యాపీ బర్త్‌డే

(2010 ఆగస్టు 8 నుంచి
2010 ఆగస్టు 14 వరకు)

జి. సంతోష్
1సం॥, ఆగస్టు-12
జిజియా-రమేష్
శనివారపుపేట-ఏలూరు

ఎం. తేజస్వి
ఆగస్టు
వెంకటలక్ష్మి-శ్రీనివాసరావు
కాకినాడ

యశశ్రీ
ఆగస్టు
శైలజ-షణ్ముఖ
కర్నూలు

వి. చైత్ర
ఆగస్టు-15
ప్రగతి-రాంరెడ్డి
అనంతపురం



ఎన్. పవన్
3సం॥, ఆగస్టు-8
రమ-ముత్యాలు
యాచారం-రంగారెడ్డి

నమ్మతోయిద్
6సం॥, ఆగస్టు-2004
రిజ్వానా-సుభాని
మొండికుంట-ఖమ్మం

ఆర్. అభిలాష్
3సం॥,ఆగస్టు-8
అరుణ-వెంకటేష్
హైదరాబాద్

ఎం. విజేందర్
2సం॥, ఆగస్టు-10
పద్మ-శ్రీనివాసులు
జమ్మిగూడ-హైదరాబాద్

సహస్రశ్రీ
2సం॥, ఆగస్టు-2008
శ్రీలత-వేణుప్రసాద్
కరీంనగర్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

హతవిధీ...

'మందు తాగండోయ్ బాబూ
తాగి తూగండోయ్'
'అభివృద్ధికి మూలం బీరు
అది లేకుంటే రాష్ట్రం బీడు'
ఇదీ మన సర్కార్ వారి పాట.

'పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్' అని గిరీశం లెక్చరిస్తే- ఆ విజ్జీనగరం బొంకులదిబ్బనుంచే ఎదిగొచ్చిన మంత్రివర్యుడొకరు- 'మందు తాగనివాడు మనిషే కాడు' అన్న లెవల్లో ఉద్బోధిస్తున్నారు. 'ఊరూరా బారు.. చూసుకో మా హుషారు' అన్న తీరున సాగిపోతున్న పాలనలో ఇంతకన్నా మంచి బోధనలు ఏముంటాయి?!

❋❋❋

తీరని కనీస అవసరాలు మనకు చాలా ఉన్నాయి.

విద్య... వైద్యం... ఇల్లు... ఉపాధి వగైరా.

ఇంతమంది జనానికి ఇన్ని బడులుండాలి, ఇన్ని ఆసుపత్రులుండాలి, ఇంతమంది టీచర్లు, ఇంతమంది డాక్టర్లూ, ఇన్ని గ్యాలన్ల మంచి నీళ్లు... అంటూ లెక్కలు కూడా ఉన్నాయి. వివిధ కమిషన్లు, జాతీయ అంతర్జాతీయ సంస్థలు శోధించి నిర్ధారించిన కొలబద్దలు... వాటికోసం జనం రకరకాల రూపాల్లో అడుగుతూనే ఉన్నారు- ధర్నాలతో, ప్రదర్శనలతో, దీక్షలతో. ఏలికలు పట్టించుకున్న పాపాన పోలేదు. లాఠీలూ అరెస్టులతో తప్ప ఎప్పుడూ చేతలతో సమాధానం చెప్పలేదు.

మందుకు మాత్రం ఇవి వర్తించవు. ఎవరు అడిగారనో, ఎవరు కోరారనో, సర్కారు వారు జనాభా ప్రాతిపదికన లెక్కలు తీశారు. ఇంతమంది జనానికి ఇన్ని బార్లు, ఇన్ని బీర్లు అని ఊరూరా, వీధివీధినా బార్లు తెరవటానికీ ఉత్తర్వులిచ్చారు. యంత్రాంగాన్ని సంసిద్ధం కమ్మన్నారు. ఏమిటీ ఘోరం అంటూ మహిళా సంఘాలు కన్నెర్ర చేస్తే తొందర పడ్డామంటారు. పాత ఫర్మానాను రద్దుచేసి కొత్తది జారీ చేశారు. ఎడమ చేతిని తీసి పుర్రచేతిని పెట్టింది మహిళలెక్కువున్న మన మంత్రి వర్గం. జనం తాగి జోగుతుంటే- జేబులు కొట్టేసి- ఖజానా నింపాలని సర్కారు వారి అధికారిక ఆరాటం. పనిలో పనిగా తమ బొక్కసాలు నింపుకోవాలి. రాజ్యాలను సుస్థిర పర్చుకోవాలి... కొందరు అమాత్యుల, అధినాయకుల అనధికారిక ఆరాటం.

హతవిధీ... ఇదా అభివృద్ధి?!

చెయ్యి మార్చు సర్కారు చేతివాటం మహాజోరు

దాని మత్తు వదలగొట్టాలి. దారిన పెట్టేందుకు ఊరూరూ కదలాలి! ★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
లైట్ తీస్కో...	...	7
వికాసం	...	8
తెల్సా	...	9
క్రైమ్‌కథ	...	10
సినిమా కబుర్లు	...	11
అట్టమీది కథ	...	14
కొత్త పుస్తకాలు	...	17
కథ	...	18
నవ్వుల్ పువ్వుల్	...	20
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4
అదే ప్రేరణతో....



చూద్దామా ... 12
సాలార్‌జంగ్ మ్యూజియంలో
టిక్... టిక్... టిక్...

చిన్న కథ ... 21
తల్లి త్యాగం



ఆకట్టుకున్న అట్టమీది కథ

జులై 25 స్నేహ ఆదివారం అనుబంధంలో అన్ని శీర్షికలు, వ్యాసాలు, కథ బాగున్నాయి. మాటల కోట కూర్పు క్లిష్టంగానూ, సులభంగానూ వుంటోంది. మెదడుకు మేత నేర్పుతుంది. దీనికి బహుమానం పెట్టి ఇద్దరు ముగ్గురికి క్యాష్‌ప్రైజు ఇస్తే పాఠకులకి ప్రోత్సాహకరంగా వుంటుందేమో! ఆటల రాణి సైనా నెహ్వాల్ గురించిన అట్టమీది కథనం సమగ్రంగా, సవివరంగా, ఆసక్తికరంగా వుండి మమ్మల్ని ఆకట్టుకుంటోంది. ప్రతీవారం ఇలానే ఒక స్పోర్ట్స్ పర్సన్ గురించి ఇస్తే బావుంటుందని నా అభిప్రాయం.

అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, శేరిలింగంపల్లి.

ఆసాంతం చదివించింది

జులై 10వ తేది సంచికలో 'చిరకాలం మిగిలిన సావిత్రి నటన' గురించి మండల్ రెడ్డి కొండల్ రెడ్డి రాసిన విశేషాల వ్యాసం ఎంతో ఆసక్తి కలిగించి ఆసాంతం చదివించింది. అందులో ఓ చోట సినీ అడ్వాన్స్ సినిమా పత్రికల ప్రస్తావన వుంది. ఈ తరం వాళ్లకి అది తెలియక పోవచ్చు కానీ నాలుగున్నర దశాబ్దాల క్రితం ఆంగ్ల సినీ వార పత్రికల్లో చెప్పుకోదగ్గవి స్క్రీన్, సినీ అడ్వాన్స్ పత్రికలు. ఈ వ్యాసంలో ఆ పేరు చూడగానే పాత పత్రికలన్నీ గుర్తొచ్చాయి. ఎవర్ని అభినందించాలి. గుర్తుచేసిన అతనినా? ప్రచురించిన మిమ్మల్నా, అందుకే ఇద్దరినీ అభినందిస్తున్నాను.

మాధవీ సనారా, అనకాపల్లి.

ధన్యులు

ఈ వారం సంచికలో 'పరవశింప జేసిన మానస సరోవరం' అద్భుత సౌందర్యాలు, కైలాస శిఖరం, పురాతన సరస్సు... వంటి విశేషాలు చదువుతుంటే జీవితంలో వీటిని చూసిన వారు నిజంగా ధన్యులు అనిపించింది.

ఆచార్య నూతి నారాయణ, గడ్డి అన్నారం.

అందించినందుకు ధన్యవాదాలు

మన దేశంలో ఉత్తరాన 600 మైళ్ల దూరం వ్యాపించి పెట్టని గోడలా వున్న హిమాలయ పర్వతాలు అద్భుత సౌందర్యం గలవి. ఇవి ఎన్నో పుణ్యక్షేత్రాలకు నిలయాలు. కైలాస పర్వతం, దాని దగ్గరున్న మానస సరోవరం వాటి ప్రాధాన్యతలను వివరించినందుకు ధన్యవాదాలు. ఆటల రారాణి సైనా నెహ్వాల్ మన దేశానికే గర్వకారణం.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

లెస్స పలికిన రూపాయి మాట

ఈవారం స్నేహలో అట్టమీది కథ ఆటల రారాణి సైనా నెహ్వాల్ గురించి ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఆహా ఏమి ఆర్టు.. చూడ చక్కగా వుంది. స్ఫూర్తి శీర్షిక గొప్ప పుస్తకాలను విశ్లేషణాత్మక వివరణతో మా ముందుంచడం అభినందనీయం. సినిమా కబుర్లు ద్వారా సినీ పరిశ్రమ స్థితిగతులు నాడు నేడు ఎలా వున్నాయో వివరించడం బాగుంది. తెల్సా లో చాక్లెట్ పార్క్ అదరహో అన్న రీతిలో వుంది. చూద్దామా అంటూ మానస సరోవరాన్ని సందర్శింప చేసినందుకు అభినందనలు. ఆర్. రామచంద్రరావు గారి గడసరి భార్య కథ నచ్చింది. బాల నేస్తాలు లో ఆమె ఎక్కడో అన్న అంశం నమ్మశక్యం కానంత గమ్మత్తుగా వుంది. మాటలకోట సరదా కాలక్షేపం కలిగిస్తూ పద సంపదను పెంపొందిస్తుంది. మనలో మాట లెస్స పలికింది. రూపాయి గుర్తు కోసం పడిన పాట్లేవో దాని విలువ పెంచడానికి పడితే బాగుండేదన్నది నిజమే.

నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం.

ఆర్టు బొమ్మలు నచ్చాయి

జులై 25 స్నేహలో ప్రచురించిన అంతర్జాతీయ క్రీడా వేదికపై మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. సైనా నెహ్వాల్ గురించి ఇచ్చిన కథనం బాగుంది. తెల్సా ద్వారా కొత్త విషయాలు తెలుసుకున్నాం. వై.కుసుమ కుమారి గారి కథ బాగుంది. చివరి పేజీలో గడసరి భార్య కథ గమ్మత్తుగా వుంది. అలాగే ఆర్టు బొమ్మలతో చేసిన ఆర్టు కూడా నచ్చింది.

అనుపోజు సంతోషినాగరాజు, విజయనగరం.



సైనా ఆటకు సై

ఆటల రారాణి సైనా తన ఆటకు సై అంటూ గెలుస్తోంది. గీతలు మారిన రూపాయి తన మారక విలువను పెంచుకోవాలి. ఇప్పుడు సార్థకమౌతుంది. అద్భుతమైనది మానస సరోవర యాత్ర. ప్రతి భారతీయుడు తన జీవితంలో ఒక్కసారైనా సందర్శించి తీరవలసిందే. నవ్వుల్ పువ్వుల్ సూక్ష్మ హాస్యంగా వున్నాయి. ఆర్టులు బాగున్నాయి. పది కోటలు కట్టిన కావూరి కోటను విశాలం చేయవయ్యా. గడసరి భార్య కథ గమ్మత్తుగా వుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:

కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

కొబ్బరి పోలీ

కావలసిన పదార్థాలు

కొబ్బరికాయ - 1, పంచదార లేక బెల్లం - 300 గ్రా

మైదా - పావుకిలో, నెయ్యి - పావుకిలో, యాలకులు - 5



తయారుచేసే పద్ధతి



మైదాలో నీళ్లు కలిపి ముద్దగా చేసి బాగా నాననివ్వాలి. కొబ్బరికోరు పంచదార లేదా బెల్లంతో కలిపి వుడకబెట్టాలి. అందులోనే యాలకుల పొడి వేయాలి. దీనిని దగ్గరగా అయ్యేవరకు అంటే ముద్దగా అయ్యేలా వుడకనివ్వాలి. ఈ ముద్దనుంచి చిన్న చిన్న వుండలు చేయాలి. ఈ వుండలు సపోటాకాయ సైజులో వుండాలి. అరిటాకు మీద నెయ్యి పట్టించి దానిమీద మైదాపిండి వేసి వడలాగా సన్నగా తయారుచెయ్యాలి. దానిమధ్యలో కొబ్బరివుండవుంచి, చుట్టూ మూసివెయ్యాలి. అంటే కొబ్బరి వుండమీద మైదాపిండి ఒక పొరలాగా ఏర్పడుతుందన్నమాట.

దానిని మళ్లీ నెయ్యి పూసిన అరిటాకు మీద పల్చగా పరవాలి. అలా చేసేటప్పుడు లోపల పూర్ణం, మైదా కలిసి సాగుతుంది. దీనిని పెనం మీద దోరగా కాలిస్తే తినడానికి రుచిగా వుంటాయి.

కొబ్బరి గుల్లా

కావలసిన పదార్థాలు

కొబ్బరి కాయలు - 2, బియ్యం - పావుకిలో

పంచదార - కిలో, నెయ్యి - పావుకిలో, సోడా - చిటికెడు

తయారు చేసే పద్ధతి

కొబ్బరిని చిన్న ముక్కలు కోసి పెట్టుకోవాలి. బియ్యం నానబెట్టాలి. నానిన బియ్యాన్ని కొబ్బరి వేసి మెత్తగా రుబ్బాలి. రుబ్బుతున్నప్పుడే సోడా కూడా వేయవచ్చు. పంచదారలో నీళ్లు కలిపి పాకం వచ్చేదాక మరగబెట్టాలి. ఇది వేరుగా తీసి వుంచుకోవాలి. మూకుడులో నెయ్యి వేసి బాగా కాయాలి. రుబ్బిన పిండిని ఆకులమీద వేసి గుండ్రంగా వత్తాలి. ఆ వత్తిన పిండిని కాగుతున్న నూనెలో వేసి వేయించాలి. వేయించిన గుల్లలను తీసి పంచదార పాకంలో వేయాలి. వేడిగా వున్నప్పుడే పాకంలో వేస్తే పాకాన్ని పీల్చుకుంటాయి. ఆరాక తినొచ్చు.



కొబ్బరి శ్రీఖండ్

కావలసిన పదార్థాలు

కొబ్బరి కాయ - 1, పెరుగు - అరలీటర్, పాలు - అరలీటర్,

పంచదార - 300, కుంకుమపువ్వు - 5 గ్రా, యాలకులు - 5

జాజికాయ - సగం కాయ, నెయ్యి - 1స్పూన్

తయారుచేసే పద్ధతి

కొబ్బరిచిప్పని కోరుకుని నేతిలో వేయించి పెట్టుకోవాలి. పలచటి గుడ్డ తీసుకుని అందులో పెరుగు పోయ్యాలి. నీళ్లన్నీ యింకిపోయేటట్లు చూడాలి. ఈ పని ఒకరోజు ముందుగా చేసుకోవడం మంచిది. పాలు మరగకాచి వేరుగా వుంచుకోవాలి. ఒక వెడల్పాటి పాత్ర తీసుకుని దాని అంచులకు పలచటి గుడ్డ కట్టాలి. దీనినే వాసెన అంటారు. పెరుగును ఇందులోవేసి పంచదార, పాలు కొంచెం కొంచెంగా చేరుస్తూ రుద్దాలి. ఇలా పాలూ, పంచదార పూర్తిగా అయిపోయే వరకు చెయ్యాలి. దీనిని ఒక పాత్రలోకి తీసుకుని కొబ్బరి కోరు, యాలకులపొడి, కుంకుమపవ్వును కలపాలి. పూరీతో తింటే బాగుంటుంది.



కొబ్బరి పుడ్డింగ్

కావలసిన పదార్థాలు

కొబ్బరి కాయ - 1 చిప్ప, కోడిగుడ్లు - 4, బిస్కెట్లు - 2

పాలు - కప్పున్నర, పంచదార - పావుకిలో, యాలకులు - 5

మిఠాయిరంగు - కొంచెం, నెయ్యి - 1 టేబుల్ స్పూన్

తయారు చేసే పద్ధతి

కొబ్బరి కోరి కొద్దిపాటి నెయ్యితో వేయించి వుంచుకోవాలి. గుడ్లు చిదిమి ఒక పాత్రలో పోసి దానిని బాగా గిలకొట్టాలి. అలా గిలకొడితే కొంతసేపటికి నురగ వస్తుంది. అందులో పంచదార, మిఠాయి రంగు, యాలకులపొడి కలిపి వుంచుకోవాలి. పాలు ఒక పాత్రలో పోసి బాగా మరుగుతున్నప్పుడు బిస్కెట్లు వేస్తే అవి పాలల్లో కరిగిపోతాయి. నాలుగోవంతు పంచదార నీళ్లతో కలిపి కొంచెం ముదురుపాకం తీయాలి. ఇప్పుడు పాలల్లో కోడుగుడ్డు సొనవేసి బాగా కలబెట్టాలి. ఒక వెడల్పాటి పాత్రలో కాసినినీళ్లు పోయండి. పాకం గిన్నె అందులో పట్టేలా వుండాలి. పాకం గిన్నెలో పాలు, కోడిగుడ్డుసొన వేసినది పోసి పైన కొబ్బరికోరు జల్లి గిన్నెను నీళ్లపాత్రలో వుంచి పొయ్యిమీద పెట్టాలి. మూత గట్టిగా బిగించాలి. ఈ మూతమీద కూడా నిప్పులు పొయ్యవచ్చు. సన్నని సెగమీద మరగబెడితే కొంతసేపటికి గడ్డ కడుతుంది. ఉడికిన తర్వాత దింపి కేకులా తయారైన దానిచుట్టూ చాకుతో గీస్తే ఊడివస్తుంది. దానిని ఒక పళ్లెంలో బోర్లించవచ్చు. చాకుతో ముక్కలు కింద కోస్తే జున్నులా ముక్కలవుతుంది.

- డా॥ డి.ఆర్.కె. ప్రసాద్
చల్లపల్లి.



అదే ప్రేరణతో...

1978 విద్యార్థి ఉద్యమాలు పరిచయం అవుతున్న రోజులు. ప్రాథమిక విద్యను గురించి ప్రతి ఆదివారం విశాలాంధ్రలో వ్యాసం వచ్చేది. మాతృభాషలోనే ప్రాథమిక విద్య ఆవశ్యకతను నొక్కి చెప్తూ, సవివరంగా, సాధికారికంగా ప్రచురితమయ్యే ఆ వ్యాస పరంపరను క్రమం తప్పకుండా చదువుతుండేవాణ్ణి. దరిమిలా 1979లో ఆ వ్యాసాలే "మాతృభాషలో ప్రాథమిక విద్య" అనే పేరుతో పుస్తకంగా వెలువడ్డాయి. గ్రంథ రచయిత విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో ఐదేళ్ల క్రితం మాకు ఆంగ్ల పాఠాలు బోధించిన ఇంగ్లీష్ లెక్చరర్ అట్లూరి పురుషోత్తం గారు. ఆ పుస్తకాన్ని అప్పుడు నాలుగు రూపాయలకు కొని, ఇప్పటిదాకా ఎన్నిసార్లు చదివానో, ఎంతమందితో చదివించానో చెప్పలేను. "తెలిసిన భాషద్వారానే తెలియని కొత్త విషయాలను నేర్చుకోవాలే తప్ప, తెలియని కొత్త భాషద్వారా తెలియని విషయాలను ఎలా నేర్చుకోగలరు?" అన్నది ఆయన వాదం. "తెలియని కొత్త భాషలో లెక్కలు, సైన్సు, సోషల్ పాఠ్యాంశాలను బలవంతంగా బోధిస్తే అవి అర్థం కాని విద్యార్థులు వాటిని బట్టీ పట్టి, తమ సృజనాత్మకతను కోల్పోరా?" అని ఆయన ఆవేదన. ఇంగ్లీషు మీడియంలో చదవడం వల్ల ఆంగ్ల భాషలో నిష్ణాతులవడం కేవలం భ్రమ అని, అశాస్త్రీయమనీ, ఆ పుస్తకంలో రచయిత రుజువు చేసిన తీరు నాటికీ నేటికీ నామనసులో హత్తుకుపోయింది.

కేవలం 110 పేజీల ఈ చిన్న పుస్తకంలో క్లిష్టమనుకున్న విషయాలు సూటిగా, సులభంగా, శాస్త్రీయంగా, సాధికారికంగా చెప్పారు. చిన్నారులు ఏ కొత్త విషయాలనైనా ప్రస్తుతం ఎలా నేర్చుకుంటున్నారో, ఎలా నేర్చుకోవడం అన్ని విధాల శ్రేయస్కరమో, చారిత్రక, భాషాశాస్త్ర కారణాలను చూపుతూ, దేశ విదేశ ఉదాహరణలు ఇస్తూ, మేధావులను, సామాజిక శాస్త్రవేత్తలను ఉటంకిస్తూ రచయిత ప్రతిపాదించిన తీరు అద్భుతం. మానవుని భావప్రకటన ప్రధానంగా భాషద్వారానే జరుగుతుంది. కొత్త విషయాలను తమకు తెలిసిన భాషద్వారా నేర్చుకోవడానికి భిన్నంగా ఆంగ్ల భాషనే లెక్కలు, సైన్సు వంటి విషయాల ద్వారా నేర్చుకోవడమనే అశాస్త్రీయ ధోరణి మీదనే ఈ చిన్న గ్రంథంలోని చర్చ అంతా నడిచింది. గృహవాతావరణంలో, మాతృభాషలో ఎన్నో నేర్చుకుంటూ నాలుగేళ్లు పెరిగిన బిడ్డను ఆంగ్ల మీడియంలో చదివిస్తే బిత్తరపోయి, అవగాహన కొరవడి, భావప్రకటన లేక ప్రశ్నించడం మరచిపోయి, బట్టీలకలవాటు పడి, సృజనాత్మకతకు దూరమై తనకు, సమాజానికి భారమైపోయే దుస్థితిని రచయిత కళ్లకు కట్టినట్లు చూపించారు. నాలుగు శతాబ్దాల నాడే ఔరంగజేబు తన గురువైన ముల్లాసాలే అరబ్బీ అనే పరభాషా మాధ్యమంలో అతి విలువైన తన 10 ఏళ్ల కాలాన్ని వ్యర్థపుచ్చినందుకు తప్పు పట్టిన విషయాన్ని (107వ పుట), 130 ఏళ్లనాడు గాంధీ మహాత్ముడు ఆంగ్ల మాధ్యమంలో తన బాల్యంలోని ఐదారేళ్లు ఎంత నిస్సారంగా గడిచిపోయాయని బాధపడిన విషయాన్ని (59వ పేజీ) ఉదహరించడం ఈ రచయిత వాదానికి మరింత బలం చేకూర్చింది.

ఈపుస్తకంలోని భావప్రేరకాలైన, దార్శనికాలైన కింది వాక్యాలు నన్నెప్పుడూ ప్రభావితం చేస్తూనే ఉంటాయి. "పరభాషలో ప్రాథమిక విద్య కొనసాగినంత కాలం మన మట్టిలోని మాణిక్యాలు మట్టిలోనే ఉండిపోతాయి"./ "మన ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో మొదటి బలిపశువు తెలుగుభాషే, రెండోది గణితం, మూడోది ఆంగ్లభాష"./ "యూరప్ దేశాలలో లాటిన్, గ్రీకు భాషల్లో విద్యా బోధన జరిగినంతకాలం ఆ దేశాలు, అక్కడి భాషలు అభివృద్ధి చెందనేలేదు"./మన భాషపట్ల, దేశం పట్ల అభిమానం లోపించడమే బానిసమనస్తత్వం. అది దేశ స్వాతంత్ర్యానికి, దేశ అభ్యుదయానికి గొడ్డలి పెట్టు".

స్ఫూర్తిదాయక గ్రంథ రచయిత, ఆంగ్లసాహిత్య కోవిదుడు పురుషోత్తంగారు కానీ, ఈ వ్యాస రచయిత గానీ మాతృభాషా ప్రేమికులే తప్ప ఆంగ్ల భాషాద్వేషులు కాదు. ఆసక్తి, అవకాశం ఉన్న ప్రతి భారతీయుడు ప్రపంచ భాషగా పేరొందిన ఆంగ్లాన్ని నేర్చుకోవాలనే మా కోరిక, ఐతే 'ఆంగ్లాన్ని ఒక భాషగా నేర్చుకోవాలే గానీ, ఆంగ్లమాధ్యమం ద్వారా ఆంగ్లభాషా నిష్ణాతులు అవుతారనుకోవడం మాత్రం భ్రమ. "అశాస్త్రీయం" అనే మా ఉద్దేశ్యం. చల్లపల్లిలో 1988లో సొంత ఆసుపత్రిలో వైద్యవృత్తి ప్రారంభించాక మా అబ్బాయిని పాఠశాలలో చేర్పాల్సిన సమయం వచ్చింది. పురుషోత్తం మాస్టారికి ఉత్తరం రాసి వారి అనుమతితో విజయవాడలోఉన్న వారింట్లో కలిశాను. 1974 తర్వాత అప్పుడే వారిని చూడడం. వారి పుస్తకం గత 14 ఏళ్లుగా నాకెంత స్ఫూర్తినిచ్చిందో వివరించి, మా అబ్బాయికి ఏదైనా మంచి తెలుగు మీడియం పాఠశాలను సూచించమని అడిగాను. విజయవాడలోని "వికాస విద్యావనం"లో చేర్చమని చెప్పారు. "నేను చల్లపల్లిలో ఉంటూ 66 కి.మీ దూరంలోని బడిలో చదివించడం ఇష్టంలేదు. ఎంత



2010లో మా అబ్బాయికి ఎంసెట్‌లో మెడిసిన్ లో ఇంటర్‌తో పాటు మొదటిసారే మూడవ ర్యాంకు రావడం, అదీ 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన గ్రామీణ విద్యార్థికి రావడం కొంత సంచలనాన్ని కలిగించింది. మాదృష్టిలో అదేం గొప్ప విశేషం కాదు కానీ, కొందరు పెద్దలు "డాక్టర్ గారు! తెలుగు మీడియంలోనే చదివించాలని మీరు ఇతరులతో చెప్పినదాన్నే ఆచరించి, విజయం సాధించి చూపారు" అని అభినందించారు. వారిలో ఒకరు మా జె.వి.వి సంస్థకు రు.5000/- విరాళంగా ఇచ్చారు. ఇక్కడ గమనించవలసిందేమిటంటే మా అబ్బాయికి ఆ ర్యాంకు రాకపోయినా నేను చేసిన పని మాత్రం శాస్త్రీయమైనదే.

బాగున్నా హాస్టల్‌లో ఉంచడం నచ్చలేదు. పాఠశాల విద్యవరకు పిల్లలు మా దగ్గరే ఉండాలని మా కోరిక" అన్నాను. "ఐతే నన్ను మీ ఊరొచ్చి తెలుగు మీడియం పాఠశాల పెట్టమంటావా?" అంటూ నవ్వారు.

మా బాబును చల్లపల్లిలోనే, తెలుగు మీడియంలోనే చేర్పించాను. అప్పుడు విజయవాడలో ఎస్.ఎస్.ఎమ్ స్కూలు చాలా ప్రసిద్ధిగాంచినది. విజయవాడలోని, జిల్లా ఇతర ప్రాంతాలలోని నా డాక్టర్ మిత్రుల పిల్లలు ఇక్కడే చదివేవారు. అందులో ఇద్దరు ముగ్గురు స్నేహితులు "ఎస్.ఎస్.ఎమ్ వంటి మంచి ఇంగ్లీషు మీడియం స్కూల్ వుండగా మారుమూల చల్లపల్లిలో అందులో కూడా తెలుగు మీడియంలో చేరుస్తున్నావా? ఏమిటీ పిచ్చిపని... అంటూ చనువుగా మందలించారు కూడా. ఐతే నేను చేస్తున్న పని సరైందని నాకు గట్టి నమ్మకం!

1990లో నేను, నా భార్య యూరప్ పర్యటనకు వెళ్లి కొన్నాళ్లు లండన్ నగరంలోని ఒక మిత్రుని ఇంట్లో వున్నాం. అక్కడి ఇతర మిత్రులు... తెలుగు మీడియంలో చేర్చి, పిల్లల భవిష్యత్తును పాడుచేస్తున్నావేమో... అన్నప్పుడు కూడా నా అభిప్రాయం అశాస్త్రీయమని నాకనిపించలేదు. పురుషోత్తంగారి పుస్తకంలోని శాస్త్రీయ వాదనలు అంతగా నాకు వంటబట్టాయి మరి! అంతకుపూర్వం నేనెంతో గాఢంగా విశ్వసించిన విషయాలు అశాస్త్రీయమని రుజువైనప్పుడు ఒక్క నిమిషంలోనే నా అభిప్రాయాలను మార్చుకున్న సందర్భాలున్నాయి.

ఇంగ్లాండు నుండి తిరిగి వచ్చిన వెంటనే నేను, నా భార్య ఒక నిర్ణయానికి వచ్చాం. ఆ రోజునుండి ఒక సంవత్సరం పాటు పరిచయంలో ఉన్న మేధావులతో, లెక్చరర్లతో, విద్యావేత్తలతో దాపరికం లేకుండా చర్చించడం, ఆ పిదప మేమిద్దరం చర్చించుకుని ఇంగ్లీషు మీడియమే మంచిదనుకుంటే అబ్బాయిని అందులోకి మార్చడం, తెలుగు మీడియమే సరైందనుకుంటే అందులోనే కొనసాగించడం" అని.

అనుకున్నట్లుగానే ఆ ఏడాది కాలంలో మేం చాలామందిని సంప్రదించాం. అప్పటికి 20 ఏళ్లగా ఆంధ్ర లయోలా కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న నా కజిన్ "పల్లెటూళ్లో పదవ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన వాళ్లకు విషయావగాహన చక్కగా వుంటుంది. కాకపోతే ఇంటర్ మొదటి సంవత్సరంలో కొంత బిడియంగా ఉంటారు. పట్టణప్రాంతం నుండి, ఆంగ్లమీడియం నుండీ వచ్చిన పిల్లలు మాత్రం చొరవగా హడావిడిగా వుంటారు. విషయపరిజ్ఞానంలో, అవగాహనా శక్తిలో వీళ్లు ఒక అడుగు వెనకే వుంటారు. సీనియర్ ఇంటర్‌లోమాత్రం ఆంగ్లంలో గానీ, గ్రూపు సబ్జెక్టులలో గానీ తెలుగుమీడియం నుండి వచ్చిన వారే ముందుంటారు" అన్నారు.

గుంటూరులోని విజ్ఞాన్ రత్తయ్యగారిని కలిస్తే, ఆయన చాలా స్పష్టంగా చెప్పారు. "పట్టణ ప్రాంతంలో ఆంగ్లమాధ్యమంలో 10వ తరగతిలో 90 శాతం మార్కులు తెచ్చుకున్న విద్యార్థికంటే జడ్.పి హై స్కూల్లో 55 శాతం మార్కులు తెచ్చుకున్న విద్యార్థులే ఇంటర్‌లో రాణిస్తారు" అని. ఇంకొక సంవత్సరం గడిచాక నా భార్య డా॥ పద్మావతి మేము ప్రారంభించిన "మాతృభాషలోనే ప్రాథమిక విద్య" అనే ఉద్యమంలో నాకంటే బలంగా పనిచేయసాగింది.

నేను జనవిజ్ఞానవేదిక సభ్యులూ ఇలా విస్తృతంగా పరిశీలన, అధ్యయనం చేసిన తర్వాత మాతృభాషలో ప్రాథమికవిద్య ప్రయోజనాన్ని గురించి, చల్లపల్లి ప్రాంతంలో ఒక ఉద్యమంగా ప్రచారం చేయాలని సంకల్పించుకొన్నాం. 1991లో అట్లూరి పురుషోత్తం గారినే ఆహ్వానించి బహిరంగ సభను ఏర్పాటు చేశాం. ఎంతగా ప్రచారం చేసినా, మా 10 -12 మంది కార్యకర్తలం కాక మరో 20 మందికి మించి రాలేదు. ఎక్కువ మంది తల్లిదండ్రులకు పురుషోత్తంగారి ఉపన్యాస సందేశమందించలేక పోయామనే నిరాశ కలిగినా కమిటీ సభ్యులం మాత్రం మరింత ఉత్తేజితులమయ్యాం. ఏ చిన్న అవకాశం వచ్చినా ఇతరులతో తెలుగు మీడియంలో చదువును గురించి మాట్లాడుతూనే ఉన్నాం. మాకు 25 కి.మీ దూరంలోని కోడూరులో ఒక పాఠశాల యజమాని బహిరంగ సభపెట్టి తల్లిదండ్రులను వారి పిల్లలను ఆంగ్ల మాధ్యమంలోనే చదివించాలని తన వాదనా పటిమను ఉపయోగించి ఒప్పించారని తెలిసింది. తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునే ఈ ప్రయత్నాలు చాలా చోట్ల జరుగుతుండగా మా చల్లపల్లి జనవిజ్ఞాన వేదిక తల్లిదండ్రులను ఒప్పించలేక ఓడిపోతామనిపించింది.

ఈ విషయాన్నే లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ గారి సలహాకోసం ఒకసారి హైదరాబాద్ వెళ్లాను. ఆంగ్లమాధ్యమం పట్ల ప్రజల్లో బలంగా ఉన్న భ్రమలను తొలగించే యుద్ధంలో ఓడిపోతున్నామని నేను కొంత నిరాశగా అంటే "ఓడిపోతామని మానేస్తారా? నమ్మిన ఆశయం కోసం పోరాడడమే మన కర్తవ్యం.." అని కొంత ఆవేశంగా వారన్నమాటలు నామీద బలంగా పనిచేశాయి. తల్లిదండ్రుల్ని ఒప్పించడంలో జయప్రకాష్ నారాయణ గారిచ్చిన సలహాలు పునరుత్తేజాన్నిచ్చాయి. తల్లిదండ్రులనుద్దేశించి, ముందుగా కరపత్రం వేయాలనుకుని అది బాగా రాయగల నాకు తెలిసిన పెద్దలను అడిగాను గానీ, కొన్ని కారణాల వల్ల అప్పటికాపని నెరవేరలేదు.

ఇక తప్పక, కాలహరణం భరించలేక నేనే ఒక కరపత్రం రాయాలనుకున్నా. అది కాస్తా కరపత్ర పరిమితిని దాటిపోవడంతో చల్లపల్లి జనవిజ్ఞాన వేదిక తరపున చిన్న పుస్తకంగా అచ్చువేశాం. అది ఆరేళ్లలో నాలుగు ప్రచురణలు పొందింది. దాని పరిచయంలో "మాతృభాషలో ప్రాథమిక విద్య"కు ఇది కేవలం పరిచయమేనని, పూర్తి వివరాలకు పురుషోత్తంగారి పుస్తకం చదవండని సూచించాము. మా జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలం ఎక్కడ ఏ అవకాశం వచ్చినా ఈ పుస్తకంలోని అంశాన్ని పదిమందితో చర్చించాలని తీర్మానించుకున్నాం.

2001లో మా అబ్బాయికి ఎంసెట్‌లో మెడిసిన్ లో ఇంటర్‌తో పాటు మొదటిసారే మూడవ ర్యాంకు రావడం, అదీ 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన గ్రామీణ విద్యార్థికి రావడం కొంత సంచలనాన్ని కలిగించింది. మాదృష్టిలో అదేం గొప్ప విశేషం కాదు కానీ, కొందరు పెద్దలు "డాక్టర్ గారు! తెలుగు మీడియంలోనే చదివించాలని మీరు ఇతరులతో చెప్పినదాన్నే ఆచరించి, విజయం సాధించి చూపారు" అని అభినందించారు. వారిలో ఒకరు మా జె.వి.వి సంస్థకు రు.5000/- విరాళంగా ఇచ్చారు. ఇక్కడ గమనించవలసిందేమిటంటే మా అబ్బాయికి ఆ ర్యాంకు రాకపోయినా నేను చేసిన పని మాత్రం శాస్త్రీయమైనదే.

ఆ సమయంలోనే జనవిజ్ఞాన వేదిక నాయకులు వి. బాలసుబ్రహ్మణ్యం గారిని ఆహ్వానించి, "తెలుగు మీడియంలో విద్య" అనే అంశం మీద మళ్లీ బహిరంగ సభ ఏర్పాటు చేశాం. మా సభ్యులు ఈ సారి ఇంటింటికీ వెళ్లి, కరపత్రాలు పంచి ఆహ్వానించారు. పదేళ్ల నాడు ఇదే అంశం మీద జరిగిన సభకు 30 మంది వస్తే ఈసారి మాత్రం మంచి స్పందన వచ్చి, 250 మంది హాజరై, ప్రధాన వక్త ప్రసంగానికి ముగ్ధులై,అందులో కొందరు ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న తమ పిల్లల్ని తెలుగు మీడియం పాఠశాలకు మార్చారు.

చల్లపల్లి ఒక మండల కేంద్రం. 20వేల జనాభా, సుమారు 10 ఆంగ్ల మీడియం పాఠశాలలు, చుట్టుపక్కల పల్లెటూళ్ల పిల్లలు ఇక్కడ తమకు ఆంగ్లంలో తెలియని లెక్కలు, సైన్సు, సోషల్ పాఠాలను చదవడం ఎంత బాధాకరమో నాకు తెలుసు. అగ్రవర్ణాల పిల్లలవలె బడుగు ప్రజలు కూడా ఆంగ్లమాధ్యమంలో చదివితే పెద్ద పెద్ద ఉద్యోగాలు వచ్చి, ఆ కులాల అభివృద్ధికి తోడ్పడుతుందనే వాదనలు బలంగా పనిచేయడంవల్ల, రాష్ట్ర ప్రభుత్వం 2008 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆంగ్ల మీడియం విద్యను ప్రవేశపెట్టినప్పుడు అది ఎంత అశాస్త్రీయమో వివరిస్తూ ఒక ప్రముఖ దిన పత్రికలో వ్యాసం రాశాను. మరో రెండు పత్రికలు దాన్ని తరువాత ప్రచురించాయి.

దూరదృష్టి లేక, మీడియం రూపంలో అత్యంత మధురమైన బాల్యాన్ని, సృజనాత్మకతను హరించి వేయడమే జీవితంలో నాకున్న అతి ముఖ్యమైన బాధ. ఉద్యమ స్ఫూర్తితో జనంలో పనిచేయడానికి ఆ బాధే కారణం. ఐతే దీనికి ప్రధాన ప్రేరణ మాత్రం అట్లూరి పురుషోత్తం గారి "మాతృభాషలో ప్రాథమిక విద్య" అనే గ్రంథమే!

★

మరణంలేని మానవత కోసం...



దాపరికం లేకుండా చెప్ప
మనిషి మనిషిని మరిచిందెపుడో
మనసుపై కప్పకున్న ముసుగులు చించి
మార్మిక ప్రణాళికల్ని బద్దలు చెయ్
బిగుసుకుంటున్న పిడికిట్లో
బాతుమెడ బంధీ అయినట్లు
నిజాన్ని మింగిన గొంతుకలో
నిట్టూర్పు పిడసగట్టినట్టు
ఎదల పొదల్లో ఎన్నెన్ని అలజడులు
కన్న పేగునే కామించిన చూపుల్లో
కరడుగట్టిన కౄరత్వానికి అడుగంటిన మానవతల
ఆచూకీ తేలడంలేదు.
అడవిలో బిడ్డనొదిలి గొడ్డైనా రాదుకదా?
పందులు మేసే చెత్తకుప్పలో
పాపెందుకు ఏడ్చినట్టు?!
అర్థం, స్వార్థం, ధ్వని సామ్యమే కాదు
ధనస్వామ్యమై శబ్దిస్తున్న సందర్భమే కావచ్చు?
పలుకు ముచ్చటారని పసిదాన్ని
కొలిమిలో కాల్చేసిన పర్వానికి ఏ పేరుపెడదాం?
నగల కోసమే నడుమొంగిన ముసలిదాన్ని
నరికి చంపిన వైనాన్ని ఏ సిరాతో లిఖిద్దాం!
బొందిలో ప్రాణముండగానే
బొంద తవ్వుతున్న చేతుల్తో ఏ సూక్తులు రాయిద్దాం!?
కారణాలేవో కనిపిస్తున్నట్టే వున్నాయి
అస్పష్ట స్వరాలుగా వినిపిస్తూనే వున్నాయి
వేసిన విత్తనాలే అవిసిపోతున్న చేలో
వేయని విత్తనాలు మొలుస్తున్నాయి చూడు
మానవత్వాన్ని మాయం చేసే
మాయగాడెవడో డాలర్ విత్తులు చల్లి
విశృంఖల విషజాలాన్ని విసురుతున్న దృశ్యం!
మనిషిని విలాసాలకు బానిసను చేసి
లాభాల లక్ష్యాన్ని చేధించే
యంత్రంగా మలుస్తున్నప్పడే అవగతమవ్వాల్సింది
ముక్కలు చేసి పిడికిళ్ళతో పిండుతుంటే
తేనెపట్టు బొట్లు బొట్లుగా రాలిపడుతున్నట్లు
మానవత్వం బలవంతంగా చేజార్చబడుతోంది
దాపరికాన్ని దాపుల్లోకి రానీయక
మనిషిని మనిషిగా నిలబెట్టే
మానుషత్వానికి "నవత్వం" సిద్ధించాల్సి వుంది
మమకారాన్ని నింపి అహంకారాన్ని తుంచి
మానవత్వ వైకల్యాన్ని జయించాల్సి వుంది

- పోతగాని

మార్పు

యాడ పోయిందమ్మ
మనిషిలో మంచి
మానవత్వం చూడ
మచ్చుకైనను లేదు

రక్తాన్ని ముద్దగా చేసి
నెలలు నిండగ నిన్ను మోసి
పురుటి నొప్పుల తోడ
నీకు పురుడు పోసె

కొంగు చాటున దాచి
కమ్మని పాలిచ్చి
కంటిలో పాపలా
కాపాడుకొంటుంది
కనుల ముందర నీవు
కదలంగ మురిసింది

పలక బలపమునిచ్చి
పాఠాలు నేర్పింది
రోజురోజుకు నిన్ను
రాజాలా పెంచింది
పస్తులతో తానుండి
నీ కడుపు నింపింది

ఉన్న రెండెకరాలు
ఊరు మునసబు కిచ్చి
తాళిబొట్టుకు కూడ
తాకట్టులో పెట్టి
పై చదువులకు గాను
పట్నంకు నిను పంపె

పేగు బంధంతోడ
పెనవేసుకుని వుండ
నవమాసములు నిండ
నిండుగ నినుమోసి
కన్న పాపానికి కడతేర్చ బట్టిరి
కసాయి చరిత్రలో కదలిపోబట్టిరి

- గజవెల్లి
దశరథ రామయ్య

అంతిమ చరణం!

ఎవరి గుండెను కదిలించినా
కొలమానాలు లేని
భైరవి రాగాన్నాలపిస్తున్నాయి!
ఎవరి మనసును ప్రశ్నించినా
గొంతుదాటని తడారిన
రాతినవ్వులే సమాధానాలౌతున్నాయి!
గాట్లు పడిన గుండె కావ్యాలు...
వెతల కథల ప్రవాహాలు...
అక్షరాల గుండెకందని నిగూఢ బాష్పాలు...
అద్దెనవ్వులు అద్దె కలబోతలై
మనసో నిబద్దత లేని రిమోట్ కంట్రోలై
యాంత్రిక జీవనయానమౌతోంది!

ఏదో ఒకనాడు
బీటలువారిన యెద కన్నీటి చుక్కలు
సానబట్టిన చురకత్తులై
విజృంభించక మానవు!
అప్పుడు
భౌతిక మానసిక యాతి బాధలకు
చరమగీతం పాడాక
అహమహమికల మెడలు వంగి
ఎవడి పాదాల ముందు
వాడు తలవంచక తప్పదు!

- గుర్రాల రమణయ్య

లైట్ తీస్కో..

ఇడియట్ బాక్స్

ఎక్స్‌క్లూజివ్ ఓన్లీ ఆన్ "జాలిగుండె" టీవీ అన్న అక్షరాలతో పాటు అదే పనిగా గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న ఓ కోతి తెరమీదకొచ్చింది.

గుడి చుట్టూ ప్రక్షిణాలు చేస్తున్న కోతి గురించిన పూర్తి వివరాలు అక్కడే వున్న మా ప్రతినిధి అరుణను అడిగి తెలుసుకుందాం అంది యంకర్ సుబ్బలక్ష్మి.

'అరుణా... అక్కడ పరిస్థితి ఎలా వుంది?" అంది యాంకర్.

"బంద్ కారణంగా పొద్దుట్నుంచీ మాకు తినడానికి దొరక్క చస్తున్నాం సుబ్బలక్ష్మి" అంది అరుణ నీరసంగా.

"నేనడిగింది మీ పరిస్థితి గురించి కాదు. ముందా కోతి వివరాలు ఏమైనా తెల్సాయా?"

"మా గురించి అనుకొన్నాన్లే... సరే.. ఆ కోతి గురించి ఇప్పుడే కొన్ని వివరాలు తెలిశాయి. అదేంటంటే.. ఆ... కోతి దైవాంశసంభూతురాలని, అందుకే అలా గుడిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తోందనీ కో.ప.స (కోతి పరిరక్షణ సమితి), కాదు... ఆ కోతి పిచ్చిదని, పిచ్చికోతి కాబట్టి అది అలా ప్రవర్తిస్తోందనీ కో.వ్య.స (కోతి వ్యతిరేక సమితి) వారు... ఇలా ఎవరికి వారే సంఘంగా ఏర్పడి ఈ వూళ్లో వుద్యమం చేస్తున్నారు సుబ్బు" అంది.

"కో.ప.స వాళ్లు అలా అనడానికి వాళ్ల దగ్గరేమైనా ఆధారాలు వున్నాయా" అంది యాంకర్?"

"ఓ జ్యోతిష్యుడి ద్వారా పూర్వజన్మ గురించి ఆరా తీస్తే అది కారణజన్మురాలని తేలిందట"

"మరి కో.వ్య.స వాళ్లేమంటున్నారు?"

"ఆ కోతి పిచ్చిదనీ అందుకే ప్రదిక్షణాలు చేస్తోందని, అది కరవకముందే దాన్ని అక్కణ్ణించి ఏ ఆసుపత్రికో, అడవికో తరలించాలని డిమాండ్ చేస్తున్నారు." అంది.

"ఇంకేమైనా విషయాలు తెలిశాయా"

"ఓ విషయం అర్థమైంది సుబ్బు"

"ఏమిటది?" అంది ఆత్రంగా.

"ఈ దిక్కుమాలిన ప్రోగ్రాం మనం తప్ప ఇంకెవరూ లైవ్ టెలికాస్ట్ చెయ్యడం లేదేమో అని నా అనుమానం"

"ఆ సంగతి నాకూ తెలుసులే. మరిన్ని అప్‌డేట్స్ కోసం నిన్ను మళ్లీ కాంటాక్ట్ చేస్తాం.. లైన్లో వుండు" అంది.

కోతి గురించి మరిన్ని అప్‌డేట్స్ తెలుసుకోబోయేముందు చిన్న బ్రేక్.

బుల్లి తెరపై కొన్ని నిమిషాలు వాంతి వచ్చే యాడ్స్ అయిపోయాక కోతి గురించి చర్చ ప్రారంభమైంది.

"ఆ కోతిని అక్కణ్ణించి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లుగా వార్తలొస్తున్నాయి. అదే జరిగితే రాష్ట్రానికే కాదు యావద్భారత దేశమే అగ్ని గుండంగా మారిపోతుంది. దానికో గుడి కట్టించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించాలి... జై శ్రీరామ్" అంటూ ఆవేశంతో వూగిపోయాడో పార్టీ నాయకుడు.

"నాకు జంతువులూ, మనుషులు చెరో కన్ను. ఏ కంటికి ఇబ్బంది వచ్చినా చూస్తూ వూరుకోను. అవసరమైతే ప్రజల్లోకెళ్లి ఈ విషయం తేల్చుకుంటా" అన్నాడో పార్టీ నాయకుడు.

"ఆ కోతి పిచ్చిదో.. మంచిదో తేల్చాల్సింది మా ప్రభుత్వం. ఇంకా వివరంగా చెప్పాలంటే మా హై కంమాండ్‌కి ఈ విషయాన్ని చెప్పాం. ఈ పాతికేళ్ల పార్టీ వాళ్లే ప్రజల్లో మా పార్టీ ఇమేజ్‌ని డామేజ్ చేయాలనే నాటకం ఆడుతున్నారు. దానికి సాక్ష్యం ఆ కోతి మెళ్లో పచ్చ రుమాలే" అన్నాడు బల్లపై అదే పనిగా గుద్ది మాట్లాడుతూ ఓ పార్టీ నాయకుడు.

"గిదేందమ్మా... గిది మా రాష్ట్రం కోతి గాదాయె. అసలా కోతి గోలేంటో.. ఏదో చర్చ అని పిలిస్తే అద్గది మా సమస్యే కదా అని వచ్చినాం. గిట్లా కోతి లొల్లి పెట్టి పాగల్ గాళ్ల లెక్క అడుగుతారే.. మీకెట్లా గనిపిస్తున్నాం" అన్నాడో పార్టీ నాయకుడు.

"సార్.. మీ అభిప్రాయం చప్పలేదు. ప్లీజ్... మీరు మీ అభిప్రాయాన్ని చెప్పండి" అంది మరో కొత్త పార్టీ నాయకుణ్ణి వుద్దేశించి.

"అదే ఆలోచిస్తున్నానమ్మా.. కోతి అంటే ఆంజనేయుడు.. కాబట్టి ఎండోమెంట్ వాళ్లనీ... మనతో వుంటుంది కాబట్టి ... అర్బన్ డెవలెప్‌మెంట్ వాళ్లని ఇంకా... అన్నీ పార్టీల్తో ఓ సభాసంఘాన్ని వేస్తే బాగుంటుందేమో అని అనుకుంటున్నాను".

చర్చ తారాస్థాయికి చేరింది. ఎవరేం మాట్లాడుతున్నారో వినే ప్రేక్షకులకి అర్థం కావడం లేదు. ఒకళ్లనొకళ్లు తిట్టుకోసాగారు. బల్లలు పైకి లేపి విసిరేస్తూ నోటికొచ్చినట్టు మాట్లాడసాగారు.

తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి నాకేందన్నట్లు యాంకర్ నవ్వుకొంటోంది.

టీవీ తెరపై అరుణ ప్రత్యక్షమైంది. "అరుణ అందించే అప్‌డేట్స్ చూసిన తర్వాత చర్చ కొనసాగిద్దాం" అంది యాంకర్ పార్టీ నాయకుల్ని వుద్దేశించి

"కొత్త విషయాలేమైనా తెలిశాయా" అంది అరుణనుద్దేశించి.

"సుబ్బు.. .ఇప్పుడే ఓ సంఘటన చోటు చేసుకుంది.. ఎవరో వెంగళప్ప అంటా. టీవీలో మన ప్రోగ్రాం చూసి కోతి తనదేననీ... మెళ్లో కట్టిన గుడ్డ చూసి దాన్ని గుర్తు పట్టానని చెప్పి కోతిని తీసుకెళ్లిపోయాడు"

"దీనిపై ఎవరెలా స్పందిస్తున్నారేంటి?"

"ఇది ప్రభుత్వం కుట్ర అనీ... ఆ కోతిని గుళ్లోకి తెచ్చి పెట్టేదాకా నిరవధిక బంద్‌కు కో.ప.సా వాళ్లు బంద్‌కు పిలుపునిస్తే...కోతిని అడవికో.. హాస్పటల్‌కో తరలించే దాకా వూరుకొనేది లేదని కో.వ్య.స. వాళ్లు బంద్‌కు పిలుపునిచ్చారు సుబ్బూ"

బంద్.. బంద్... బంద్... జరుగుతూనే వుంది. కంటిన్యూగా. ఫ్లాష్..... ఫ్లాష్... అంతా కోతి గురించి చిలవలు పలవలుగా 'జాలిగుండె' టీవీలో వస్తూనే వుంది.

నిరంతర వార్తా ప్రసారాల కోసం చూస్తూనే వుండండే 'జాలిగుండె' టీవీ.

-బెండపూడి రమేష్‌బాబు

అంతా హడావిడి జీవితం. పొద్దున లేచిన దగ్గర నుంచి ఒకటే ఉరుకులు. పరుగులు. ఉదయం చేయాల్సిన టిఫిన్, కూర గురించి రాత్రే ఆలోచించాలి. అన్నీ సిద్ధం చేసుకొంటేగానీ నిద్రపోడానికి లేదు. పొద్దుట లేచాకైనా ప్రశాంతంగా వుంటుందా అంటే అదీ లేదు. పిల్లలను స్కూళ్లకు రెడీ చేసి, క్యారేజీలతో సహా పంపాలి. వారెళ్లాకైనా తీరిక వుంటుందా అంటే... ఊహూ... ఎవరి టైమ్‌కి వారు ఆఫీసులకు చేరుకోవాలి. ఏదో ఇంత కడుపులో వేసుకొని బస్సుల్లో వేళ్లాడుతూ వెళ్లాలి. ఇల్లు చేరేసరికి ఇంతెత్తున పని ఎదురు చూస్తుంటుంది. మళ్లీ రొటీన్ లైఫ్! మనసులో జీవిత భాగస్వాముల పట్ల ప్రేమాభిమానాలు ఎంతగా వున్నా వ్యక్తం చేయలేనంత బిజీ. అటువంటప్పుడు మీభావాలు వారికెలా తెలుస్తాయి? ఓకే! మీకు ఆయన/ఆమె అంటే ఇష్టమని ఆయనకూ/ఆమెకూ తెలీదని కాదు. మానవమాత్రులన్నాక ఎప్పుడూ ఏదో ఒక తాజాదనం వుండాలికదా. అదే మనిషిని నిత్యనూతనంగా, సంతోషంగా నడిపిస్తుంది. మరి అలా వుండాలంటే...



ప్రేమతో...

ఎన్నో సందర్భాలు అలా వచ్చి ఇలా చెప్పాపెట్టకుండా వెళ్లిపోతుంటాయ్. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, చూపులు కలిసిన శుభవేళలు, మాటలు కలిసిన మలిసంధ్య వేళలు...ఇలా! వాటిని మనం ఒక్కసారి గ్రీటింగ్ కార్డు ద్వారా గుర్తు చేశామనుకోండి. ఊహించని ఈ పలకరింతతో ఉక్కిరిబిక్కిరౌతారు. ఆనందంతో ఎగిరి గంతేసినంత పనిచేస్తారు. వారిని అంతగా గుర్తుంచుకున్నందుకు... గుర్తు చేసినందుకు వారి మనసులో మీ స్థానం మరింత పెరుగుతుంది.

➠అసలు భాగస్వామి పట్ల మనసులోని ప్రేమను వ్యక్తం చేయడానికి ఇలా సందర్భమే అవసరమా? అనుకోకండి. అవసరమే లేదు. అందాకా వేచివుండనే అక్కర్లేదు. మీరు అనుకున్న క్షణంలోనే ... సొంతగా గ్రీటింగ్ కార్డ్ చేసి మనసులోని మాట రాసేయండి. ఇంతటితో ఐపోలేదు. దానితో పాటు ఆ కవర్‌లో ఒక కీచైనో, పెన్నో కొత్తది పెట్టి ఇవ్వండి.

➠వీటన్నిటినీ మించి మీ అభిమానాన్ని తెలియచెప్పడానికి ఒక కరస్పర్శ చాలు. దాన్ని మించిన గ్రీటింగు, గిఫ్టు మరోటి లేదు. మాటల సందర్భంలో వారు మాట్లాడేది, చెప్పినది మీకు నచ్చినప్పుడు భుజాన్ని ప్రేమగా తట్టండి. అరచేతిని సుతిమెత్తగా నొక్కి వదలండి. ఇది ఎన్నో వందల భావాలను వారికి చేరవేస్తుంది.

➠వారు తల నొప్పితోనో, కాళ్ల నొప్పితోనో బాధపడుతున్నప్పుడు మీరే చొరవ తీసుకొని ఏదైనా బామ్ మసాజ్ చేస్తూ కబుర్లు చెప్పండి. ఆనక వేడివేడిగా కాఫీ అందివ్వండి. ఆ నొప్పులన్నీ మటుమాయం అవుతాయి.

➠ఏదైనా పిక్నిక్ ఏర్పాటు చేయిండి. అదీ వారికి తెలీకుండా. ఆరోజంతా జాలీగా గడిపేశాక ఎంతో సంతోషం కన్పిస్తుంది వారి మొహాల్లో. ఆ కళ్లల్లో మీ పట్ల ప్రేమాభిమానాలు స్పష్టంగా కనిపించకపోతే అప్పుడడగండి (అయితే వారికి ముఖ్యమైన పనులేమీ లేవని తెలుసుకున్నాకే ఈ ఏర్పాటు చేయాలి. లేకపోతే దృశ్యమే మారిపోతుంది).

➠వారు చేసే రొటీన్ పనుల్లో సాయం చేయండి. అదీ అడక్కుండా చేస్తే మరింత బావుంటుంది. కూరగాయలు తరగిపెట్టడం, బట్టలు మడతపెట్టడం, ఇస్త్రీ చేయడం, ఇష్టమైన టిఫెన్ చేసి అందివ్వడం, రాత్రుళ్లు పాప ఏడ్చినప్పుడు బుజ్జగించడం, నేపీలు మార్చడం, వాహనాన్ని తుడవడం, పిల్లల పనులు చేసిపెట్టడం...వంటివన్నమాట. ఏది చేస్తే వారు సంతోషపడతారో ఆలోచించి చేయాలి.

➠ఇష్టమైన పాట పాడి వినిపించండి. మీ గొంతు పి.సుశీలలాగో, ఎస్పి బాలు లాగో వుండనవసరం లేదు. మీకు మీరే గానకోకిలలు, గానగంధర్వులు. చాలా సంతోషిస్తారు.

➠ఆమె ఎక్కువగా మీకోసం వంటగదిలోనే సమయం వెచ్చించాల్సి వస్తోందా! మరైతే మీరే చొరవ తీసుకోండి. తనకంటే ముందుగా నిద్రలేచి టిఫెన్ చేసి వేడివేడిగా అందించండి. అంత బాగా వంట రాకపోతే కుకర్‌లో బియ్యం, పప్పు పెట్టేయండి. పాలు కాచి సిద్ధంగా వుంచండి. చేతనైతే కాఫీకూడా కలిపేయండి. చక్కటి కబుర్లతో వాటిని ఆస్వాదించండి.

➠తనకు ఇష్టమైన పువ్వును అందివ్వండి. ఆకళ్లల్లో మెరుపు చూడండి.

ఇవన్నీ తెల్సినవే. కాకపోతే ఆచరణే...!

- కె. చరిత

మాస్క్ పిల్లాడు

తిరునాళ్లకో, ఎగ్జిబిషన్లకో వెళ్లినప్పుడు ఒక దృశ్యం సాధారణంగా ఆవిష్కృతమౌతుంటుంది. అక్కడ పులులు, సింహాలు, కుందేళ్ల మోహాల మాస్కులు అమ్మే అబ్బాయి దగ్గర పిల్లలంతా చేరుతుంటారు. పెద్దలను ఒప్పించి మరీ తమకు నచ్చిన మాస్కు కొనిపించుకొని వెళుతుంటారు సంతోషంగా. అయితే తమాషా ఏంటంటే... ఒక చైనా పిల్లవాడికి మాత్రం ఈ సమస్యే లేదు. ఎందుకంటే అతని మొహమే ఒక మాస్కులాగా వుంటుంది.అతని పుర్రెలో కొంత భాగం లేకుండానే పుట్టాడు. దాంతో మాస్కులాగా అనిపిస్తుంది మొహం. మరి ఇప్పుడు శాస్త్రసాంకేతిక రంగాలు అంతగా అభివృద్ధి చెందాయికదా. కాస్మొటిక్ సర్జరీతో సరిచేయవచ్చుకదా అనిపించొచ్చు. తమాషా ఏంటంటే... అతనికి అలాంటిదేదైనే చేస్తే మొహం సరికావడం సంగతి అటుంచి ప్రాణాలే పోయే ప్రమాదముందట.

130 ఏళ్ల బామ్మ

అబ్బో...ఆ బామ్మకు బర్త్‌డే వేడుకలు చేసుకోవడం కొంచెం ఖరీదైన వ్యవహారమే. ఎలాగంటారా! మరి ఆమెకు 130 ఏళ్లు. అన్ని కొవ్వొత్తులు వెలిగించాలంటే కష్టం కదా. అందుకే అలాగన్నాం. ఇంతకీ బామ్మది సోవియట్ యూనియన్‌కి చెందిన జార్జియా. పేరు యాంటిసా. 1880లో పుట్టింది. తన జీవితకాలంలో జరిగిన చారిత్రక ఘటనలకు సాక్షీభూతంగా మిగిలిపోయింది. ఈకళ్లతోనే యుఎస్ఎస్ఆర్ పతనం, ప్రచ్ఛన్నయుద్ధం... అన్నీ చూసింది. 1965లో తన 85వ ఏట పనిపాటలనుంచి రిటైర్మెంట్ తీసుకొని విశ్రాంతి తీసుకుంటోంది. ప్రస్తుతానికి కొండల్లో తన 40 ఏళ్ల మనవడితో కలిసి నివసిస్తోంది. ఇంతకీ బామ్మగారి గొప్పేంటంటే... ప్రపంచంలోకెల్లా వృద్ధ మహిళ ఈవిడేనండీ బాబూ. మొన్న జులైలో 130వ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంది ఘనంగా. పెదాలకు రంగు వేసుకొని, మెరిసిపోయే గౌను తొడుక్కొని ఫేమ్ కర్ర పట్టుకుని కుర్చీలో కూర్చున్న బామ్మ తన ఆరోగ్య రహస్యం చెప్పింది. అదేంటంటే... ఎప్పుడూ ఖాళీగా వుండకుండా ఇంట్లోనో, పొలంలోనో ఏదో ఒక పని చేస్తూనే వుండేదట. అందుకే మరి అంత ఆరోగ్యంగా వుంది.

తెల్సా!

చక్క సైకిల్

చక్క సైకిల్ చేయడం అసాధ్యమని ఎవరన్నారు చెప్పండి? చూశారుగా బొమ్మలో కనిపిస్తున్న సైకిల్‌ని. ఓ చైనా వాలా చకచకా చేసేశాడు. చేయడమే కాదండోయ్! రింజిమ్ రింజిమ్ సైకిల్ వాలా అని పాట పాడుకుంటూ చైనా వీధుల్లో షికార్లు కొడుతున్నాడు. అంత కావాల్సుంటే కాస్త పరిశీలనగా చూడండి. సైకిల్‌లోని ప్రతి ఒక్క భాగం చక్కతో చేసిందే. ఇదెలా సాధ్యం? అంటారా! ఆయన మంచి కార్పెంటర్ లెండి. అందుకే ఒక నట్టుగానీ, శీలగానీ వాడకుండా అంతా చక్కతోనే సైకిల్ చేసేశాడు. మామూలుగా సైకిల్ నడవడానికి చైన్ అవసరం కదా. చైన్ స్థానంలో చక్కను అమర్చి సైకిల్‌ను నడిపించేస్తున్నాడు. అయితే ఈ సైకిల్ నున్నగా వున్న రోడ్ల మీద మాత్రమే సజావుగా నడుస్తుంది. ఎగుడుదిగుడు రోడ్లమీద దీని ఆటలు సాగవు. ఎందుకంటే సీట్‌కి స్పాంజి ఏమీ వుండదు కాబట్టి కూర్చోవడం కష్టం. రెండవది చక్రం కూడా త్వరగా పాడయ్యే ప్రమాదం వుంది. అందుకన్నమాట.

గడ్డి కారు

మీకు గడ్డి కారు తెల్సా! లేదా? పోనీ దాని గురించి విన్నారా? లేదా? మరందుకే ఇవాళ మీ ముందుకు తీసుకొచ్చాం. చూడండి ఎంత అందంగా వుందో! అలా రోడ్డుమీద నడుస్తున్న గడ్డికారును చూస్తుంటే ఏదో ఒక పార్కు ఇలా కదిలి వెళుతున్నట్టుంటుంది. రొటీన్ కార్లతో బోర్ కొట్టిన కొంతమంది ఇలా గడ్డి కార్లను తయారుచేసుకొని షికారు కొడుతున్నారు. అదేమంటే... వేసవికాలంలో ఇలాంటి కార్లలో ప్రయాణం చేయడంలో భలే మజా వస్తుంది తెల్సా! అని సమాధానం చెప్తున్నారు. పైగా లోపల చల్లగా కూడా వుంటుందట. మనమెప్పుడూ అలాంటి కార్లలో వెళ్లలేదు కాబట్టి అవునా అని అనుకోవడం తప్ప మరేం చేయలేం. ఏమంటారు!



క్రైమ్ కథ

రీ డయల్

"హలో రంజని.. ఇంట్లో తలుపులేసుకుని నిద్రపో! సడన్‌గా నేను ట్రయిన్‌లో హెడ్ ఆఫీసుకు పోవాల్సిఉంది. ఇంట్లో ఉన్న నాలుగులక్షలు క్యాష్ బాక్సులో నుండి తీసేసి మన బెడ్‌రూమ్‌లో పాడయిన టీవీ వెనుక షీట్ తీసేసి అందులో పెట్టేసెయ్. అసలే దొంగల భయం మన టౌన్‌కు ఎక్కువగానే ఉంది" లోగొంతుతో యస్‌టిడి బూత్‌లో ఇంటికి రింగ్‌చేసి చెప్పాడు అనిల్ పండా.

"అయ్యో భోజనానికి రాకుండా ఏమిటా ఆఫీసు పనులు"

"ఏయ్ రంజనీ... ఇవి మనలాంటి వారికి తప్పవు. నేను ఆఫీసులోనే తిన్నాను. నాకోసం చూడకుండా నీవు నిద్రపో! రేపు మధ్యాహ్నానికి వచ్చేస్తా"

అర్ధరాత్రి జోగుతూనే యస్‌టిడిలో కూర్చున్న యువకుడు బిపిన్ చెవులు రిక్కించి అనిల్‌పండా మాటలు విన్నాడు.

"ఏమిటయ్యా నిద్రపోతున్నావు?" అని డబ్బులుఇచ్చి రైల్వేస్టేషన్ లోకి వెళ్లిపోయాడు అనిల్.

బిపిన్ లాండ్‌ఫోన్ వైపు చూస్తూనే కళ్లుపెద్దవి చేసాడు.

సరిగ్గా అప్పుడే అటుగా వచ్చాడు రజ్జూ. వస్తూనే రెండు టీలు ఆర్డర్ ఇచ్చివచ్చాడు. వెనుకనే టీలు వచ్చాయి. ఇద్దరు తాగుతూ మౌనంగా ఉన్నారు. "ఏరా బిపిన్ రైల్వేస్టేషన్ ఎదురుగా షాపులో పనిచేసేకంటే ఈరాత్రిమీద ఆగిన ట్రయిన్‌లో రిజర్వుడ్ కంపార్టుమెంటులో దూరి ఏదో ఒక సూట్‌కేసుతో దిగిపోరాదా? నీ లక్ బావుంటే నోట్లకట్టలే ఉంటాయి. ఎందుకురా నిద్ర కళ్లతో ఈ జాగారం" అని నవ్వాడు.

"రెండుసార్లు చేసాను.ఆ సూటుకేసుల్లో మాసిన దుస్తులు తప్పితే ఏమీ దొరకలేదు. సరే నాకు నాలుగు లక్షలనిధి గురించి ఇప్పుడే తెలి సింది.చేతులు కలుపుతావా. ఇప్పుడే దోచుకుని వద్దాం" లోగొంతుతో అడిగాడు.

రజ్జూ కళ్లుపెద్దవయ్యాయి. "నైట్ పెట్రోలింగ్‌లో ఉన్నాను. నైట్ ఎక్స్‌ప్రెస్ వెళ్లాక ఇక్కడకి వస్తాను. పోలీస్‌డ్యూటీ కదా యస్‌ఐ వెళ్లాకనే రాగలను. ఇద్దరం ఆపని చేద్దాం. వర్కవుట్ అవుతుందా?"

"నువ్వు రా. నేను ప్లాన్ చేస్తాను. ఖచ్చితంగా మనవే ఆనాలుగు లక్షలు" అని చెబుతుండగా ఎవరో ఫోన్ కోసం వచ్చారు. వారికి ఫోన్ ట్రబుల్ ఉందని చెప్పి మరో బూత్‌కు పొమ్మన్నాడు.

రజ్జూ అటువైపు పోలీస్‌వ్యాన్ వచ్చాక అదెక్కి పట్టణంలో గస్తీకై వెళ్లిపోయాడు. బిపిన్ షాపు మూసేసి ఎదురుగా నిలబడ్డాడు. ఎవరో ఒకరు వచ్చి ల్యాండ్‌ఫోన్‌లో మాట్లాడితే అనిల్‌పండా చేసిన ఫోన్‌కాల్ రీడయల్ కాస్తా చెరిగిపోతుంది. అందుకే షాపు మూసాడు.

ఒకగంట అయ్యాక రజ్జూ స్వంతబైక్‌మీద వచ్చాడు.

"రేయ్ బిపిన్ నామీదకు రాకుండా ఉండాలి.మరి నా జాబ్ పోయి జైలుపాలు కాకూడదు. పక్కాగా ప్లాన్ వేసుకుని వెళ్లాలి. ఇదివరలో ట్రయిన్ దిగిన వారిని, సూట్‌కేసులు చెక్‌చేసి ఏవైన స్మగుల్డు వస్తువులుంటే కొట్టేసేవాళ్లం.అలాంటిదయితే పర్వాలేదు.కానీ,లక్షల్లో అంటే దొంగ బంగారమా?" రజ్జూ బిపిన్ భుజంపై చేయివేసి మరీ అడిగాడు.

విషయం చెవిలో చెప్పాడు. రజ్జూ కళ్లుపెద్దవయ్యాయి. "దోచుకుంటే సరిపోదు. ఆరంజని బతికుంటే ఇద్దర్ని గుర్తు పడుతుంది. లేకుంటే నీ పథకం బాగుంది."

"దాన్ని వేసేద్దాం.ఆపని నేనే చేస్తాను. నీ చేతులకు రక్తం అంటనక్కర్లేదు. ఇంత మంచి అవకాశం ఇలా వెతుక్కుంటూరాదు."

ఇద్దరు షాపు తెరిచి రీడయల్ చేసారు. అవతలివైపు నుంచి రంజని ఫోన్ ఎత్తింది. "మేడమ్! మీరు రంజనిగారేనా? పోలీసులం. అనిల్ పండా రైల్వేస్టేషన్‌లో దిగుతూనే పడిపోయారు. దెబ్బలేమి తగల్లేదు కానీ, రైల్వే ఆసుపత్రిలో ఎడ్మిట్ చేసి సెలైన్ ఎక్కిస్తున్నారు. మీ చిరునామా చెప్పండి. ఇప్పుడే మిమ్మల్ని కలుస్తాం. మీరు ఇరుగు పొరుగుకు చెప్పి గోల చేయకండి. అనిల్‌కు ఏమీ కాలేదు."

ఏడుస్తూనే చిరునామా చెప్పింది.రజ్జూ నోట్ చేసి ఫోన్ రిసీవర్ పక్కకు పడేసి ఇద్దరు బైక్ ఎక్కారు.రిసీవర్ పక్కకు పడేయడానికి కారణం రంజని ఆత్రపడి మనం అక్కడికి వెళ్లేలోపు రింగులు ఇస్తుంది చెప్పి స్పీడుగా బైక్ పోనిచ్చాడు. ఇలా తలుపు కొట్టారో లేదో తెరిచింది. ఆమె అప్పటికే శోకదేవత అయ్యింది.బిపిన్ ఒక్క నిముషం ఆలస్యం చేయకుండా ఆమెను కత్తితో పొడిచేసి నేలమీద పడేసాడు. ఇద్దరు తెరిచిన తలుపులు వేసేసి బెడ్ రూమ్‌లో టీవీని తెరిచి అందులో నోట్లకట్టలు అందుకుని అక్కణ్నించి పారిపోయారు.

ఉదయాన్నే రజ్జూకి పోలీసులు రంజని హత్య గురించి చెప్పి వెంటనే బయల్దేరిరా! శవాన్ని పోస్టుమార్టమ్ చేయించుకుని రావాలన్నారు. బిపిన్ చంపిన విధానంతో నిద్రపట్టని రజ్జూ తప్పదన్నట్టు బయల్దేరాడు. క్రయిమ్స్ ఇన్‌స్పెక్టర్ శవాన్ని చూసి లోపలికి వెళ్లి ల్యాండ్‌ఫోన్ రిసీవర్ ఎత్తి రీడయల్ చేసాడు. అవతలి నుంచి రైల్వేస్టేషన్ దరి అశోకా బూత్‌సెంటర్ అని విన్పించింది. వారి వివరాలు రాసుకున్నాడు. అప్పటికే రంజని భర్త అనిల్ వచ్చాడు.వచ్చి పాడయిన టీవీలో డబ్బులేక పోవడంతో "నాలుగులక్షల కోసం హత్య చేశారు. ఇది కంపెనీ డబ్బు. పాడయిన టీవీలో దాచమని నాభార్యకు చెప్పాను" అని భోరుమని ఏడ్చాడు.

"అనిల్, మీభార్య రాత్రి రెండుగంటలకు అశోక్ బూత్‌కు ఫోన్ చేసింది. అక్కడికి ఆటైమ్‌లో ఎందుకు చేసింటుందో చెప్పగలరా?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"నేను చేసాను. ఆమె చేయలేదు. మాఫోన్ రీడియల్‌లో ఉందా వివరం" అని అనిల్ ఆలోచనలో పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ మరింత లోతుగా ప్రశ్నలు వేసాడు. "మీరు ఆ బూత్‌లోంచి ఫోన్‌చేసి ఏం మాట్లాడారు. గుర్తుకు తెచ్చుకుని చెప్పండి" అని అడిగాడు.

అనిల్ తానేం చెప్పాడో చెప్పాడు. వెంటనే పోలీసులను పిలిచి అశోక్ బూత్‌లో రాత్రి పనిచేసే బిపిన్‌ను అరెస్టుచేసి రాణాకు తీసుకు రండి అని చెప్పి పంపాడు.ఆ పోలీసుల్లో రజ్జూ ఉన్నాడు. రారెత్తిపోయాడు. క్షణాల్లో బిపిన్‌ను అతడింట్లో అరెస్టు చేసారు. అతడు హత్య ఎలా చేసింది చెప్పాడు.రజ్జూని కూడా అరెస్టు చేసారు. ఇద్దరికి ఆరేళ్ల జైలుశిక్ష పడింది. సెల్‌ఫోన్లు రానిరోజుల్లో జరిగిన ల్యాండ్‌ఫోన్ క్రయిమ్‌స్టోరీ.

- యర్నాగుల సుధాకరరావు

ఏ భాషా చిత్రమైనప్పటికి కుటుంబ విలువలకు అద్దం పట్టే కథ, కథనాలతో వచ్చినవి అజరామరంగా నిలవడమే కాదు. కాసుల వర్షాన్ని కురిపించాయి కూడా. తెలుగు చలన చిత్రాల వరకు ఆలోచిస్తే కుటుంబ నేపథ్యంలో సాగే చిత్రాలు 90వ దశకం వరకు కనిపించాయి. ఆ తరువాత అడపా దడపా కనిపిస్తున్నాయి. అలాంటి వాటిలో కొన్ని చిత్రాలు భారీ విజయాలు సాధించాయి. అయితే రాను రాను కుటుంబ విలువలకు తిలోదకాలిస్తున్నారు.

సినిమాల్లో... కుటుంబ విలువలేవీ!

నాటకం తరువాత ప్రేక్షకులను రంజింప చేయడంలో సినిమా మంచి సక్సెస్‌ని సాధించింది. సినిమా వచ్చి నాటకం ప్రాధాన్యతను తగ్గించినట్టే బుల్లితెర కార్యక్రమాల వెల్లువలో వెండితెర వెలుగులు తగ్గుతూ వస్తున్నాయి. అందుకే చిత్ర నిర్మాణంలో అనేక మార్పులు వచ్చేశాయి. ప్రేక్షకులు 'క్యూ' కట్టి సినిమా చూసే స్థాయి నుండి అడపాదడపా సినిమా చూసే స్థాయికి వచ్చేశారు. మహిళా ప్రేక్షకుల శాతమైతే మరీ తగ్గిపోయింది. దాంతో సినిమాకు దశ దిశ నిర్దేశంగా యువతే కనిపిస్తుంది. అందుకే చిత్ర పరిశ్రమ యువతను టార్గెట్ చేసే సినిమాలను నిర్మిస్తోంది. యువతకు ఆసక్తికరమైన అంశాలు ప్రేమ, యాక్షన్. కాబట్టే కుటుంబ కథాంశాలతో వచ్చే చిత్రాలు కనుమరుగైపోయాయి.

లవ్, యాక్షన్ చిత్రాల్లో కుటుంబ నేపథ్యం వుండకూడదా? అంటే ఖచ్చితంగా కుటుంబ విలువలతో కథ అల్లితే అది భారీ విజయం సాధించవచ్చు. ఒక్కోసారి సరిగా కుదరకపోయినా, స్టార్ కాస్టింగ్ లేకపోయినా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడే పరిస్థితి రావచ్చు. అందుకే ఇలాంటి చిత్రాలను తీసేవారు కథ, కథనాలను హీరో, హీరోయిన్, ఫ్రెండ్స్ మధ్య నడిపించేస్తారు. ఒకవేళ కుటుంబం చూపించాల్సి వస్తే ఒకటో రెండో సన్నివేశాలకు పరిమితం చేసేస్తారు.

1950 – 90 వరకు ఎనభైశాతం ఎక్కువ మంది తారాగణంతో, కుటుంబ విలువలతో నడిచిన తెలుగు సినిమా నానాటికీ తారాగణ సంఖ్య కుదించుకుపోతుంది. ఈ పరంపరలో చాలా కుటుంబ సంబంధమైన పాత్రలు కనుమరుగైపోతున్నాయి. నేడు మహా వుంటే హీరో హీరోయిన్లకు తల్లిదండ్రులు, ఒక చెల్లో తమ్ముడో ఉంటున్నారు. ఈ పరిస్థితులు ఆయా పాత్రలను బఫూన్లుగా మార్చేస్తున్నాయి. నేడు ఎక్కువగా యంగ్ మదర్, ఫాదర్ పాత్రలు కనిపించి శృతిమించిన నటనను ప్రదర్శిస్తున్నాయి. చెల్లి, తమ్ముడు వంటి పాత్రలైతే మహా ముదుర్లే.

నాన్నను బఫూన్ చేసే ఫ్రెండ్స్ ఎక్కువగా నేటి సినిమాల్లో కనిపిస్తున్నారు. అమ్మతో శృతి మించిన డైలాగులు కొట్టే హీరోహీరోయిన్లు దానికి వంతపాడే సిస్టర్, బ్రదర్ క్యారెక్టర్లు నేటి సినిమాకు ఫ్యాషన్‌గా మారాయి. అన్నావదిన, మరిది, మరదలు, బాబాయి, పిన్ని, పెద్దకోడలు, చిన్నకోడలు వగైరా పాత్రలు పూర్తిగా కరువైపోయి ఏక పిలుపుగా అంకుల్, ఆంటీ పాత్రలే నేటి సినిమాల్లో దర్శనమిస్తున్నాయి. ఈ రొమాంటిక్ పిలుపులతో సినిమా అల్లరి అల్లరిగా నడిచేస్తుంది. అలా వుంటేనే ప్రేక్షకులు సినిమాకు వస్తారని నిర్మాతల భావం. అందుకే నేడు తక్కువ తారాగణంతో అల్లరి చిల్లరి చిత్రాలే ఎక్కువగా వచ్చేస్తున్నాయి. వీటిని అధిగమించి సంప్రదాయ సినిమాలు వస్తే కలెక్షన్లకు తిలోదకాలు ఇచ్చి టేస్ట్‌కి నిర్మాత ఆహ్వానం పలకాల్సిందే.

ఒకప్పుడు ఒక హీరోయిన్ ఒకే హీరోకు ఆలిగా, చెల్లిగా, వదినగా నటించినా నటనలో వైవిధ్యం కనిపించేది. ప్రేక్షకులు కూడా ఏ భావనలో చూస్తున్నారో అదే భావన ఫీలయ్యేవారు. మరి అలా ఈనాడు సాధ్యమవుతుందా? అంటే ఖచ్చితంగా కాదనే చెప్పాలి. ఎందుకంటే ఈనాటి సినిమాల్లో కుటుంబ విలువలు కనిపించక పోవడంతో ప్రేక్షకులు ఇలాంటి సన్నివేశాలను అంతగా జీర్ణించుకోలేక పోతున్నారు. అంతేకాక నేడు సెంటిమెంటుతో సినిమాను సొమ్ము చేసుకోవాలంటే నిర్మాత చేతులు కాల్చుకున్నట్లే. అందుకే నిర్మాతలు ఎక్కువగా ఎంటర్‌టైన్‌మెంటునే కోరుకుంటున్నారు. ఆ బాటలోనే సినిమాలను తీస్తూ ఆ పరిస్థితుల్లో కుటుంబ విలువలు చూపాల్సి వస్తే వాటిని కూడా అసహజంగా, అపహాస్యంగా సినిమాల్లో జొప్పించి నేటి జనరేషన్‌కి కుటుంబం అంటే ఇంతే అన్నట్లుగా చూపిస్తున్నారు.

“అమ్మా లేదు.. నాన్నా లేదు... పిల్లనిచ్చి పెళ్లి చేసే మామా లేదు.. ఏక్ నిరంజన్” అన్న తరహాలోనే పాత్రల రూపకల్పన జరగడం వల్ల విలువలు నశించిపోతున్నాయి. పాత్రలు కూడా నేలవిడిచి సాము చేసే తరహాలోనే వుంటున్నాయి. హీరో పేదవాడైనా బైక్ వుంటుంది. ఖరీదైన డ్రెస్సులుంటాయి. ఇదంతా ఏమిటంటే సినిమా రూల్స్ అంటారంతే! మరి పాతకాలం తీసుకుంటే పాత్రల ఔన్నత్యం, తీరుతెన్నులు, స్థాయిని బట్టి ఆహార్యాలు, భావాలు ఉండేవి. నేటి సినిమాల్లో అది పూర్తిగా నశించడం వల్లే అసహజత ఎక్కువగా తెరపై సాక్షాత్కరించపడుతుంది.

కుటుంబ విలువలను తెలియజెప్పే మాటలు, పాటలు ప్రేక్షకుణ్ణి ఎంతో రంజింప చేయడంతో పాటు ఆలోచింపజేసేవి. మరి నేడు ఇలాంటివి మచ్చుకైనా కనిపించవు. సంగీత హోరులో కొట్టుకుపోయే పాటలు సినిమా థియేటర్ల వరకే పరిమితంగా కనిపిస్తాయి, వినిపిస్తాయి. డైలాగుల్లో 'పంచ్' అనే పదం వినిపించడంతో ద్వంద్వార్థాల ప్రయోగం ఎక్కువగా సాగుతోంది. దీనివల్ల బరువైన డైలాగైనా పేలవంగా మారిపోయి పటుత్వం కోల్పోతుంది. ఇక అంతే! ఇలా తీస్తేనే నాలుగు కాసులు వచ్చేది, నష్టాల నుండి బయటపడేది అన్నది నిర్మాతల అభిప్రాయం.

కానీ అడపాదడపా నిండైన 'బొమ్మరిల్లు' వంటి క్లీన్ చిట్ చిత్రాలు వచ్చినప్పుడు 'శుభప్రదం'లో లాంటి సాహిత్యం వినిపించినప్పుడు ప్రేక్షకుల్లో నిద్రాణమైనవున్న కుటుంబ విలువలు మేల్కొంటాయన్నది వాస్తవం. అలాంటి వాటిని అందించాలనే తపన నిర్మాత, దర్శకుల్లో ఉన్నప్పుడు తారాగణం కూడా మనసుపెట్టి చేస్తుంది. కుటుంబ విలువలను ప్రతిబింబించే చిత్రాలకు ఎప్పుడూ ప్రేక్షకులు పట్టాభిషేకం చేస్తారు. పురస్కారాలు కూడా దండిగా దరిచేరతాయన్నది ఇండస్ట్రీ ఎరుగని సత్యం కాదు.

- బాసు



సమయం: సాయంత్రం నాలుగు గంటలు. ప్రదేశం: సాలార్‌జంగ్ మ్యూజియం, మ్యూజిక్ క్లాక్ ఆడిటోరియం. ఆరోజు ఆదివారం కావడంతో మ్యూజియంలో సందర్శకుల తాకిడి కొంచెం ఎక్కువగానే వుంది. రాజధానివాసులు, విదేశీయులు, చుట్టపుచూపుగా పొరుగూళ్ల నుంచి వచ్చినవారితో నిండుగా వుంది. దాదాపుగా మ్యూజియం చూడ్డానికి వచ్చినవారంతా అక్కడికే చేరారు. మామూలుగా అంతమంది ఒకచోట చేరితే కీసరబాసరగా వుంటుంది. కానీ హాలంతా నిశ్శబ్దంగా వుంది. గుండుపిన్ను కిందపడ్డా శబ్దం వినిపించేంత ప్రశాంతంగా వుంది. అందరి చూపులూ మ్యూజిక్ గడియారంపైనే వున్నాయి. రెప్పవేస్తే గడియారంలోంచి వచ్చే లిల్లీపుట్ మనిషిని మిస్సయిపోతామేమోనని అలా చూస్తుండిపోయారు. గతంలో క్లాక్‌ను చూసినవారుకూడా అదే తొలిసారన్నట్టు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. అలా చూస్తుండగానే చిన్న ముల్లు నాలుగు మీదకు, పెద్దముల్లు 12 మీదకు రావడం... ఆ బొమ్మ మనిషి తన గది తలుపు తెరుచుకొని బయటకు రావడం... నాలుగు సార్లు గంట కొట్టడం ఒకేసారి జరిగిపోయింది. "ఓ... సరిగ్గా నాలుగైంది" అని సంతోషంగా నవ్వుకుంటూ ... మ్యూజిక్ క్లాక్ గురించి మాట్లాడుకుంటూ ....సందడి సందడిగా వెళ్లిపోయారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో టిక్... టిక్... టిక్...

- కె.అంజన



ఇది సాలార్‌జంగ్ మ్యూజియంలో నిత్యం కన్పించే దృశ్యమే. ఈ ఒక్క గడియారమే కాదు. అక్కడ గడియారాల విభాగంలో (క్లాక్ గ్యాలరీ) వందలాది గడియారాలున్నాయి. విభిన్న కాలాలకు చెందిన ఈ గడియారాలను సాలార్‌జంగ్ ఎంతో సమయం, శ్రమ వెచ్చించి ఎక్కడెక్కడినుంచో తెప్పించి ఇక్కడ భద్రపరిచారు. మ్యూజియంను సందర్శించినవారంతా వీటిని చూడడానికి ఎంతగానో ఉవ్విళ్లూరతారు. మరి దేశదేశాల గడియారాలను ఒకచోట చూసే భాగ్యం భాగ్యనగరంలో తప్ప మనకు ఎక్కడ వుంది? అందుకే ఈ ఆరాటమంతా. అందుకే ఈ విభాగం చూడకుండా బయటకు రానేలేరు. రారు కూడా. మనం ఈ గడియారాల గురించి చెప్పుకోబోయే ముందు గడియారాల చరిత్రను కూడా తెల్సుకోవడం అవసరం. ఎందుకంటే మ్యూజియంలో గడియారాలు రకరకాల కాలాలకు చెందినవి. మరి కాల చరిత్ర పుటలు తిరగేద్దామా!



కాలాన్ని కొలిచిందెలా?

కాలాన్ని కొలిచే అలవాటు ఇప్పటిది కాదు. ప్రాచీన కాలం నుంచీ వుంది. కాకపోతే తొలి నుంచీ మనం ఇప్పుడు చూస్తున్న గడియారాలు లేవంతే. కాలాన్ని కొలవడానికి సాధనం కావాలి. మరి ఆ సాధనం లేనప్పుడేం చేసేవారు. ఏముంది? కోడి కూతతో నిద్రలేచేవారు. తర్వాత సూర్యుడి ఆధారంగా సమయాన్ని అంచనావేసుకునేవారు. అంతేకానీ శాస్త్రీయంగా ఎటువంటి సాధనాలు లేవు. అయితే తర్వాత్తర్వాత నీడ గడియారాలు వచ్చాయి. అంటే సూర్యుని కదలికనుబట్టి, నీడను బట్టి కాలాన్ని అంచనావేసుకునేవారని భావించవచ్చు. మొదట రోజును 24 గంటలుగా విభజించింది ఈజిప్టువారే. నీడల స్థంభాలను బట్టి సమయాన్ని తెలుసుకునేవారు. బాగా పొడవాటి రాతి స్థంభాలను ఎండ బాగా పడేచోట పాతిపెట్టేవారు. వాటి నీడ పెరుగుదల, తరుగుదలను బట్టి టైమ్‌ను తెలుసుకునేవారు.

నీటి గడియారాలు

నీడ గడియారాలు సూర్యుడి మీద ఆధారపడి నడుస్తాయి. ఇవి ఎండ వున్నప్పుడు ఓకే. మరి వాన పడినప్పుడు, మబ్బుగా వున్నప్పుడు మాటేంటి? అప్పుడు సమయమెలా తెలుస్తుంది? నిజంగానే ఆరోజుల్లో జనం సమయం తెలియక చాలా ఇబ్బంది



పడ్డారుకూడా. దాంతో నీడ గడియారానికి ప్రత్యామ్నాయ గడియారాన్ని కనిపెట్టాలనుకున్నారు. అదే నీటి గడియారం. దీన్ని కూడా ఈజిప్షియన్లే కనిపెట్టారు. ప్రాచీన రోమన్లు కూడా దీన్ని వాడారు. పెద్ద పాత్రలో నీరుపోసి సన్నటి గొట్టం ద్వారా నీరు కారిపోయే ఏర్పాటు చేశారు. నీరు తగ్గేకొంది కాలాన్ని చెప్పగలిగేవారు. 1 నుంచి 5వ శతాబ్దాల్లో దీన్ని వాడారు. వీటి తర్వాత ఇసుక గడియారాలు వాడుకలోకి వచ్చాయి. వీటిని రోమన్లు వాడుకలోకి తెచ్చారు. గాజుపాత్రలో ఇసుకను పోసి పాత్రలకున్న సన్నని రంధ్రాల ద్వారా ఇసుక కిందికి జారుతుంటే కాలాన్ని లెక్కించేవారు. 5 నుంచి 13 శతాబ్దాల్లో మధ్య యుగంలో ఇవి వాడుకలోకి వచ్చాయి.

యంత్రం సాయంతో నడిచే గడియారాలు

ఇలా నీడ, నీరు, ఇసుక కాదు. ఏదైనా యంత్రంతో కాలాన్ని చెప్పగలిగితే బావుండు అన్న ఆలోచన వచ్చింది. ఫలితమే గోథిక్ గడియారాలు. మొదట ఇవి చాలా పెద్దగా వుండేవి. వీటిని ఎక్కువగా చర్చిల్లో వాడేవారు. లోహంతో చేసిన ఈ గడియారాల్లో చక్రాలు, ముల్లు వుండేది. గంటకోసారి గంటకొడుతూ జనాన్ని ఆకట్టుకునేవి. 13వ శతాబ్దం ఆఖరి సంవత్సరాల్లో చర్చిలో గంటలు కొట్టడానికి బరువులు, చక్రాలు అమర్చిన యంత్రగడియారాలు వచ్చాయి.

18వ శతాబ్దపు గియారపు అలంకరణలో ఎన్నో మార్పులొచ్చాయి. 19వ శతాబ్దంలో గడియారాల సైజు తగ్గించారు. తొలిసారిగా పీటర్ హెన్లెయిన్ అనే వ్యక్తి గడియారంలో స్ప్రింగ్‌ను ఏర్పాటుచేశాడు. అప్పటివరకు గడియారాల్లో వాడుతున్న ఇనుముకు బదులుగా ఇత్తడి వాడుకలోకి వచ్చింది. నిముషాల ముల్లుకూడా వచ్చి చేరింది. ఇక గడియారాల ఆకారాల్లో వింత వింత మార్పులు చోటు చేసుకున్నాయి. చేతికి పెట్టుకునే వాచీలు కూడా ఈ శతాబ్దంలోనే వచ్చాయని చెప్పుకోవచ్చు. జేబు గడియారాలు వచ్చాయి. ఈ మాట చెప్పగానే మీకు గాంధీజీ గడియారం గుర్తుకొచ్చిందా! క్రమంగా చిన్న చిన్న గడియారాలు వచ్చాయి. రకరకాల డయల్లతో ఎన్నో గోడగడియారాలు, చేతి గడియారాలు మనకు ఇవాళ మార్కెట్లో కన్పిస్తున్నాయి. మరి విభిన్నాకృతుల్లో వున్న గడియారాలను ఒకచోటకు తీసుకురావాలని, వాటిని ప్రదర్శనకు వుంచాలని ఎందరికి అనిపిస్తుంది చెప్పండి. అది సాలార్‌జంగ్ మెదడులో పుట్టడం వల్లే మనందరం వాటన్నిటిని చూడగలుగుతున్నాం. ఈ మ్యూజియంకు వచ్చిన సందర్శకులందరూ క్లాక్ గ్యాలరీని ఎంతో ఉత్సుకతతో చూడ్డానికి కారణం కూడా అదే. మనం లేని కాలంలో సమయాన్ని ఎలా తెలుసుకున్నారన్న ఆసక్తి కలగడం మానవ సహజం. అందువల్లే ఈ గ్యాలరీ ఎప్పుడూ నిండుగా వుంటుంది.

గడియారాల విభాగం

సాలార్‌జంగ్ మ్యూజియం మొదటి అంతస్తులో వున్న క్లాక్ గ్యాలరీలోకి అడుగెట్టగానే పాతకాలంలోకి...వివిధ దేశాల్లోకి వెళ్లిపోయిన ఫీలింగ్ కలుగుతుంది. మరి అక్కడ ఫ్రాన్స్, ఇంగ్లాండ్, జర్మనీ, ఇటలీ, అమెరికా, స్విట్జర్లాండ్ వంటి అనేక దేశాల గడియారాలున్నాయి. వీటన్నిట్లోకి ఒక్కటి మాత్రం ప్రతి ఒక్కరికి నచ్చుతుంది. అదే గంటల గడియారం. బొమ్మ మనిషి గంట గంటకు తన గదిలోంచి బయటకు వచ్చి సుత్తితో గంట మోగించి వెళ్లడం ప్రతిసారీ కొత్తగానే వుంటుంది. ఎన్నిమార్లు చూసినా వింతగానే వుంటుంది. మొదటిసారిగా చూస్తున్న భావన కలుగుతుంది. ఇత్తడిమీద గిల్టుతో నగిషీలు చెక్కిన బాక్సులో వున్న ఈ గడియారం ఎంతో అందంగా, ఆకర్షణీయంగా వుంటుంది.



ప్రాచీన కాలంలో తయారుచేసిన గడియారాలతో పాటు నిన్నమొన్నటి వరకు చేసిన వాచీల వరకు 300కు పైగా అక్కడ దర్శనమిస్తాయి. అన్నీ 18,19,20 శతాబ్దాలకు చెందినవే. భూతద్దం సాయంతో చూసే గడియారాల నుంచి 10 అడుగుల ఎత్తున్న గడియారాల వరకు వున్నాయి. ఇనుము, ఇత్తడి, పింగాణి, చెక్క, రాతితో చేసిన గడియారాలున్నాయి. వీటిమీద చెక్కిన నగిషీలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. పైగా ఎన్నో రకాల ఆకారాల్లో ఇమిడ్చిన గడియారాలు దర్శనమిస్తాయి. ఒంటె, ఏనుగు, తాబేలు, టేబులు, గొడుగు, టేబుల్, లాంతరు, బంతి, గ్లోబ్ సూర్యుడు, గన్ క్యారేజ్, రథం, ఒంటె, ఇంద్రజాలికుడు, గొర్రెపిల్ల, భోజనం తినే క్యారేజీ... వంటి వింత వింత ఆకారాల్లో మనకు గడియారాలు కన్పిస్తాయి. వీటిలో కొన్నిటి ముళ్ల సాలెపురుగులను కూడా పోలివుంటాయి. రకరకాల దేశ ప్రజలు, భిన్న జీవనశైలి మనకు ఈ గ్యాలరీలో కళ్లకు కడుతుంది. వీటిలో కూడా ఎన్నో రకాల ఆకారాలు కన్పిస్తాయి. చతురస్రం, వృత్తం, దీర్ఘచతురస్రం, అర్ధచంద్రాకారం, షట్కోణాకృతి గడియారాలు కన్పిస్తాయి. నెపోలియన్ చక్రవర్తి పక్కన గన్‌క్యారేజ్‌లో అమర్చిన గడియారం ప్రత్యేక ఆకర్షణ. ఆ తర్వాత చెప్పుకోదగినది తాబేలు గడియారం. తాబేలు డిప్పకు కొద్దిగా మార్పులు చేసి తయారుచేసినదీ గడియారం.





వీటిలో ఇంటికి అందాన్నిచ్చేవేకాక, హోటళ్లు, సత్రాలు, చర్చిలు, గుళ్లలో వాడేటువంటి పెద్ద పెద్ద గడియారాలూ వున్నాయి. అంతా చక్కతో చేసిన గడియారం కూడా కట్టిపడేస్తుంది. ఇలాంటి వాటిని పూర్వం జమీందారులు వాడేవారు. ఇలాంటి ఎన్నో కళాఖండాలు మ్యూజియంలోని క్లాక్ గ్యాలరీలో చోటు సంపాదించుకున్నాయి. వీటన్నిటి మధ్యలో నిలబడి చూస్తూ వుంటే సమయమే తెలీదంటే ఆశ్చర్యపోతారు. మరి ఒక్కసారి వెళ్లి చూడండి మీరూ అలాగే అనుకుంటారు.

★





పదాల పదనిసలు

- సుధామ

బస్సులోనో, రైల్లోనో ప్రయాణం చేస్తుంటారు. చదివే అలవాటున్న వాళ్లు ఏ దినపత్రికో. వార పత్రికో చదువుతుంటారు. చదవడం కంటే కాలక్షేపానికీ, సరదాకీ, కాస్త మెదడు ఆలోచనకీ పనికొచ్చేదేమైనా వుందేమో అని ఆ పత్రికలోకి తొంగిచూస్తే సాధారణంగా చప్పున కనిపించేది మాటలకోట లాంటి గళ్ల నుడికట్టే. లేదా ఇప్పుడిప్పుడు కొంతకాలంగా చోటుచేసుకుంటున్న అంకెల క్రీడ సుడోకు. గళ్ల నుడికట్టు వైపు ఎక్కువమంది పాఠకులు ఆకర్షితులు కావడానికి కారణం! ఇచ్చిన ఆధారాలతో ఆ పదాలను కనుక్కుంటూ అడ్డగళ్లు, నిలువు గళ్లూ అక్షరాలతో నింపుతూ తద్వారా తన భాషా పరిజ్ఞానాన్ని, పద సంపదనూ, ఒక పదానికి అది కనుక్కునేందుకు పజిల్ నిర్మాత రకరకాలుగా ఇచ్చే ఆధారాల నుండి ఒక ఆలోచననూ, ఆనందాన్ని పొందడానికి దోహదపడడమే.

శ్రీశ్రీ ప్రస్థాన త్రయం ఆవిష్కరణ సభ జూబ్లీ హాల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సభా ప్రారంభానికి ఇంకా సమయముంది. ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు గారిని పలకరించితే "సుధామ.. మీరు నాకు బాగా గుర్తే! మీ పజిల్స్ నింపుతుంటాను. ఈ ముదిమి వయసులో మెదడును చురుగ్గా ఉంచడానికి అవెంతో పనికొస్తాయి" అన్నారు. అలాగే ఓ సభలో కొన్నాళ్ల క్రితం చేకూరి రామారావుగారు ప్రముఖ సాహిత్య విమర్శకులు పలకరిస్తూ "గళ్ల ఇచ్చేటప్పుడు నిలువు గళ్లలో పదాలు నింపేందుకు విధిగా ఒక అడ్డం గడిలో అక్షరం కూడా ఉండేలా నిర్మాణంచేస్తూ ఆధారాలు ఇవ్వండి. కేవలం అడ్డానికో, నిలువుకో మాత్రమే వుండేవి సరికాదేమో!" అని సూచించారు. ఇలా గళ్ల నుడికట్టులు నింపేవారిలో ఆసక్తి, శ్రద్ధ కనబరిచే సాహితీ దిగ్గంతుల నుండి సామాన్య పాఠకుల వరకు ఉండడమే ఈపజిల్స్ ప్రాచుర్యానికి నిదర్శనం. పదవినోదం, పదరంగం, పదచదరంగం, పదరసం, పదశోధన, పదబంధం, పదనిసలు, సండే పజిల్, మాటలకొలువు, పద్మవ్యూహం, పజిలింగ్ పజిల్, పదక్రీడ, పదవిన్యాసం, పదప్రజ్ఞ, పదగారడి, పదకేళి ఇలా పేరు ఏదయితేనేం వివిధ దిన, వార, మాస పత్రికల్లో ఇంగ్లీషులో క్రాస్‌వర్డ్ పజిల్స్ అని పిలుచుకునే ఈ గళ్లనుడికట్టులు నేటికీ దర్శనమిస్తున్నాయి. సరదాగా నింపి సమాధానాలు సరి చూసుకునేలాంటివి కొన్నయితే, నింపి పంపితే సరియైన సమాధానాలు రాసిన వారి పేర్లు ప్రచురించేవి కొన్ని, నింపి పంపినందుకు పుస్తకాల్లోనో, విలువైన నగదు బహుమతులను ఇచ్చేవి మరికొన్ని. ఇలా వివిధ పత్రికలు ఈ గళ్లనుడికట్టులను నిర్వహిస్తున్నాయి.

మన తెలుగులో ఆరుద్రగారే తొలుత గళ్లనుడికట్టు నిర్మించారనీ, అయితే శ్రీశ్రీ 'పదబంధ ప్రహేళిక' పేరున దానిని ప్రాచుర్యం లోకి తెచ్చారని అంటారు. ప్రాచీన ప్రబంధాల్లో బంధ కవిత్వం, చిత్ర కవిత్వం పేర ఇలా ఒక ఆకృతిలో అర్థవంతమైన అక్షర సముదాయాన్ని కూర్చడం వుంది. అయితే ఈ క్రాస్‌వర్డ్ పజిల్స్ తరహా మాత్రం ఇలా ఒక నిర్దుష్ట చదరపు ఆకారపు గళ్లతో నిర్మితమై వచ్చింది మాత్రం ఆంగ్లం నుండే.

కాస్‌వర్డ్ పజిల్ పుట్టిందిలా...

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పద క్రీడ ఈ క్రాస్‌వర్డ్ పజిల్. మొట్టమొదట 19వ శతాబ్దిలో ఇంగ్లాండులో తొలిసారిగా రూపుదాల్చింది. అడ్డంగానూ, నిలువుగానూ గళ్లలో అక్షరాలు నింపుతూ పదాలను నింపడం ఈ క్రీడలో ప్రధానం. ఆ పదాలు కనుక్కోడానికి ఆధారాలు ఇవ్వబడతాయి. యు.ఎస్‌లో ఇది పెద్దల కాలక్షేపానికి ప్రధానమైందిగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. లివర్‌పుల్ వాసి అయిన ఒక జర్నలిస్టు ఆర్థర్ వ్యిన్నె దీనికి ఆద్యునిగా గుర్తింపబడ్డారు. 21 డిసెంబర్ 1913లో 'న్యూయార్క్ వరల్డ్' దినపత్రిక ఆదివారం సంచికలో తొలిసారి క్రాస్‌వర్డ్ పజిల్ వచ్చింది. అప్పుడు ఇప్పటి నలుచదరపు ఆకారంలో లేదు. డైమండ్ ఆకారంలో మొదటి క్రాస్‌వర్డ్ పజిల్ వచ్చింది. అంతేకాదు లోపల ఎక్కడా నల్లగళ్లు

లేవు అందులో. వారాంతపు పజిల్‌గా కామిక్ సెక్షన్‌లో వ్యిన్నె దానిని ప్రకటించడంతో విపరీతమైన స్పందన వచ్చింది. 1914లో పాఠకులు కూడా అలా పజిల్ నిర్మించి పంపడం మొదలు పెట్టారు. వ్యిన్నె వాటిని కూడా వినియోగించేవాడట. అయితే కూర్పులో అచ్చుతప్పులు (గళ్లల్లోనూ, ఆధారాల్లోనూ ఇప్పుడు ఇప్పుడూ తారట్లాడుతూనే వుంటాయి) వివరీతమవడంతో క్రాస్‌వర్డ్‌పజిల్ ఆపేస్తే పాఠకులు నానా గోల చేసి తిరిగి ప్రారంభమయ్యేలా చూశారట. 1920లో ప్రస్తుతం పత్రికల్లో వస్తున్న చదరపు పద్ధతి నిర్మాణం మొదలై దాదాపు అమెరికన్ న్యూస్ పేపర్లన్నీ క్రాస్‌వర్డ్ పజిల్ ప్రచురిస్తూ సాగాయి. ఆ తరువాత పదేళ్లకు అట్లాంటిక్, యూరప్ దేశాలకు ఈ అక్షర క్రీడ వ్యాపించింది. బ్రిటీష్ పత్రికల్లో తొలిసారి పియర్సన్స్ మ్యాగజైన్‌లో 1922 ఫిబ్రవరిలో, 1930 ఫిబ్రవరి 1న టైమ్స్ మ్యాగజైన్‌లో క్రాస్‌వర్డ్ పజిల్ సాక్షాత్కరించింది. అమెరికన్ పజిల్స్ కన్నా బ్రిటీష్ క్రాస్‌వర్డ్ పజిల్స్ తమదైన ముద్రతో మెదడుకి నిజంగా ఒక మేతగా వుండసాగాయి. మార్మికమైన, గూఢార్ధభరితమైన గళ్లనుడికట్టులను ఎ.ఎఫ్.రిట్చి, డి.ఎస్.మాక్‌నట్ట్ ఆధారాలు ఇవ్వడంలో ఒక గజిబిజి తనాన్ని, చమత్కారాన్ని పాటిస్తూ ఒక స్థాయి కల్పించారు.





ఎలా చేస్తారు?

చదరం, దీర్ఘచతురస్రాకారంలో తెల్లని మరియు నల్లని గడులతో వుండే దీంట్లో గళ్లను అక్షరాలతో నింపుతూ, పదాలను లేదా వాక్యాన్ని కనుక్కోవాలి. ఆధారాలను బట్టి సమాధానాలు సాధించాలి. అడ్డంగానూ, నిలువుగానూ ఈ అక్షరాలు గళ్లలో నింపడం వుంటుంది. ఒక్కసారి కుడినుండి ఎడమకు, కిందినుండి పైకి చదువుకునేలాగానూ నింపడానికి ఆధారాలు ఇస్తుంటారు. పదం ప్రారంభమయ్యే గడిలో సంఖ్యను చూపించడం జరుగుతుంది. నాలుగు అడ్డం, పద్దెనిమిది నిలువు అన్నట్లుగా సంఖ్యతో మొదలయ్యే పదాలు కనుగొనే ఆధారాలు ఇస్తారు. అసలు మజా అంతా ఆధారాలలోనే వుంటుంది. ఆ ఆధారాలను మెదడుకు మేత పెడుతూ సరిగ్గా అర్థం చేసుకుని పట్టుకోగలిగితే నింపడం అలవోకగానే అనిపిస్తుంది. ఒక పదానికి గల నానార్థాలు, పర్యాయపదాలు, సామెతలు, జాతీయాలు, నుడులు, సాహిత్య పరిజ్ఞానం, వర్తమాన అంశాల అవగాహన ఇలా అన్నీ అవసరం పడుతుంటాయి. ఆయా క్రాస్‌వర్డ్ పజిల్స్ రూపొందిన విధానం బట్టి, ఆధారం చివర మొత్తం పదంలోని అక్షరాల సంఖ్యను బ్రాకెట్లలో ఇవ్వడం జరుగుతుంది. ఒక్కొక్కసారి ఆ సంఖ్య సూచించని పదబంధ ప్రహేళికలూ వుంటాయి. ఒకవేళ వాక్యం కనుక్కోవాల్సి వస్తే ఆ వాక్యంలో ఎన్ని పదాలు వుంటాయినే సూచన కూడా ఇస్తారు. ఈ గళ్లనుడికట్టులలో తేలికవీ, కొంచెం కష్టమైనవీ, అతిగా బుర్రకు శ్రమ కలిగించాల్సినవీ కూడా వుంటాయి. 7×7, 9×9 గళ్లవి ఎక్కువగా తెలుగు పత్రికల్లో ముఖ్యంగా దిన, వార పత్రికల్లో చూస్తాం. 8 గళ్లవీ, 10 గళ్లవీ, 12 గళ్లవీ వుంటాయి. అలాగే ఆంగ్లపత్రికల్లో 15×15, 21×21, 23×23, 25×25 గళ్లతో వుండేవీ వస్తుంటాయి. మాసపత్రికల్లో పన్నెండు గళ్లు అడ్డం ప్లస్ నిలువుగా వుడేవి, అడ్డం 17 నిలువు 9 గా పజిల్ 'రచన'గా వుండేవి వున్నాయి. అలాగే పిల్లల కోసం కొన్ని పత్రికల్లో అయిదు గళ్ల పజిల్స్ రూపొందించబడ్డాయి.



ఎన్ని రకాలో...

ఇక ఈ క్రాస్‌వర్డ్ పజిళ్లలో ప్రత్యేకం భాషా సంబంధంగానూ, భక్తి, సంస్కృతి సంబంధంగానూ ఇలా ప్రత్యేకించి రూపొందించబడి ఇచ్చే పదబంధాలూ వుంటుంటాయి. సినిమా మాధ్యమం ఇవాళ చాలా ప్రభావోపేతమైనది కాబట్టి సినీపదరంగం అంటూ ప్రత్యేకించి పత్రికలు సినిమా గళ్లనుడికట్టులు కూడా ఇవ్వడం జరుగుతుంటుంది. 'సితార, సంతోషం' వంటి సినిమా పత్రికలు గతంలో ఇలాంటి సినిమా పజిల్స్ ఇచ్చినవే.

విదేశాల్లోనూ వున్నాయ్

వాషింగ్‌టన్ పోస్ట్, ది యు.ఎస్.ఎ టుడే, న్యూయార్క్ టైమ్స్, ది హెరిటేజ్ న్యూస్ పేపర్ వంటి అమెరికన్ పత్రికలే కాదు హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి పత్రికలూ క్రాస్ వర్డ్ పజిల్స్ ఇస్తున్నాయి. తెలుగు దిన పత్రికల్లో రోజువారీగా ప్రస్తుతం ఆంధ్రప్రభ దినపత్రికల్లో సుధామ, ఆంధ్రభూమి దిన పత్రికల్లో పెద్దిభాట్ల సుబ్బరామయ్య పదనిసలు, పదకేళి నిర్వహిస్తూనే వున్నారు. ఎడ్యుకేషనల్ క్రాస్‌వర్డ్ పజిల్స్ విదేశాల్లో ప్రాముఖ్యంగా వున్నాయి. భాష, కెమిస్ట్రీ, బైబిల్ ఆధారంగా క్రాస్‌వర్డ్ పజిల్స్ ఇప్పటికీ అక్కడ సాగుతున్నాయి. తేలికగా, సులభంగా, కష్టంగా కష్టతరంగా ఎలా వున్నా వీటిని నింపే వ్యసనానికి ప్రపంచవ్యాప్తంగా ఎందరో లోనయ్యారు. వీటిని నింపడంలో ఆనందాన్ని, పూర్తి చేయగానే ఒక గొప్ప ఆత్మవిశ్వాసాన్ని, ధీమానీ పొందుతుంటారు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1944లో ది డైలీ టెలిగ్రాఫ్‌లో వస్తున్న క్రాస్‌వర్డ్ పజిల్స్ మిలిటరీ ఆపరేషన్స్‌కు చెందిన రహస్యాలను బహిర్గతం చేస్తున్నాయని రక్షణ అధికారులకు అనుమానం కలిగింది. 1944 మే 2 వ తేదీ ఉటా అనే లాండింగ్ స్థావరం పేరు. అలాగే కృత్రిమ ఓడ రేవుల పేర్లు జూన్ 2 న నెప్ట్యూన్ అనే 'నేవల్ ఆపరేషనల్ ప్లాన్' పేరు వచ్చింది. ఆ క్రాస్‌వర్డ్ పజిల్‌ను ఇచ్చింది 'లియొనార్డ్ డావె' అనే స్కూల్ టీచర్. అతన్ని అనుమానించి అరెస్టు చేశారు. 1984లో 'ది డైలీ టెలిగ్రాఫ్' పత్రిక క్రాస్‌వర్డ్ పజిల్స్ ఎడిటర్ ఆర్మీ క్యాంపుల్లోని కుర్రల నుండి ఆ టీచర్ ఒక స్టూడెంట్ చెప్పిన పదాలను వినియోగించడం వల్ల ఈ గందరగోళం ఏర్పడిందని తెలిసింది.

క్రాస్‌వర్డ్ పజిల్స్ నింపే వ్యసనంలో పడి పనులు కూడా మందగిస్తున్నాయని బ్రిటన్‌లో ఒక సందర్భంలో వీటిమీద నిషేధం చూడా విధించారట. ఆ తరువాతనే పనివేళల్లో విశ్రాంతి సమయాన్ని విభజించి అనుమతించారట. గిన్నిస్ బుక్ రికార్డుల ప్రకారం రోగర్ స్క్వెయిర్స్ అత్యధిక క్రాస్‌వర్డ్ పజిల్స్ తయారు చేసిన వ్యక్తిగా 15 మే 2007న నమోదయ్యాడు. ది టైమ్స్, ది డైలీ టెలిగ్రాఫ్, ది గార్డియన్, ఫైనాన్షియల్ టైమ్స్, ది ఇండిపెండెంట్ మొదలైన పత్రికల్లో గళ్లనుడికట్టులు ఇచ్చిన అతను 14 మే 2007 నాటికి మొత్తం ఆరవైఆరు వేల ఆరువందల అరవై ఆరు పజిల్స్ రెండు మిలియన్ల ఆధారాలతో ఇచ్చాడట. గళ్లనుడికట్టులో యాభై ఎనిమిది అక్షరాల పదం ఇచ్చిన పజిల్ నిర్మాత కూడా తానే!

ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, పోలెండ్, హిబ్రూ మొదలైన అనేక భాషల్లో క్రాస్‌వర్డ్ పజిల్స్ దూసుకువెడుతున్నాయి.

మన రాష్ట్రాల్లో...

ఇక మన దేశంలోనూ వివిధ భాషా పత్రికల్లో ఈ పదబంధ ప్రహేళికలు వస్తున్నాయి. మన దేశానికి చెంది ఎ.ఎన్.ప్రహ్లాదరావ్ అనే బెంగుళూరు వాసి కన్నడ భాషలో ఇప్పటికే ఇరవైమూడువేల గళ్ళనుడికట్టులు చేశాడట. వాటిల్లో ఆరువేలు సినిమాలకు సంబంధించి రూపొందించినవి. ప్రహ్లాదరావు మూడు దినపత్రికలకూ, ఇరవైనాలుగు వివిధ మ్యాగజైన్లకూ తయారు చేసిన ఈ ప్రహేళికలకై ఆరులక్షల ఇరవైవేల ఆధారాలు ఇచ్చినవాడయ్యాడు. ఇక బెంగాలీలో కూడా బ్రిటీష్ నుడికట్టు పద్ధతిలో పదచదరంగాలు రూపొందింది ప్రకటిస్తున్నారు. అయితే బెంగాలీ గళ్ళనుడికట్టులో రెండక్షరాల పదాలను ఇప్పుడు పరిహరించారట! నిజంగా అదో విశేషమే!

అంకెల పజిల్

గణితంలో లాటిన్ స్క్వేర్ మూలంగా లియాన్ హార్డ్ ఈలర్ అనే గణితశాస్త్రవేత్త 1780లో అంకెలను వరుసగళ్లతో ఒకసారి వచ్చిన అంకె మరొకసారి రాకుండా ఒకటినుండి తొమ్మిది వరకు వచ్చే పద్ధతి పజిల్ కనుక్కున్నాడు. డెల్ పత్రికలు వీటిని అందిపుచ్చుకున్నాయి. అమెరికాలో కనుక్కున్నా జపాన్‌లో వేనీగోల్డ్ అనే హాంగ్‌కాంగ్ రిటైర్డ్ జడ్జి టోకియో బుక్ స్టోర్‌లో 1997లో వీటిని ప్రవేశపెట్టాడు. అంకెలు ఒంటరిగా జత కట్టకుండా ఉండడం అనే అర్థంలో sujji wa dokushin ni karigu అనే జపనీస్ పదం కుదింపబడి 'సుడోకు'గా ఇవాళ ప్రపంచ వ్యాప్తమైన అంకెల క్రీడగా ప్రాచుర్యం చెందింది. బ్రిటీష్ న్యూస్‌పేపర్ ది టైమ్స్ 12 నవంబర్ 2004లో తొలిసారి 'సుడోకు' ప్రచురించింది. యు.ఎస్ కు ఆ తర్వాత పరివ్యాప్తమై ఇవాళ ప్రపంచ ప్రసిద్ధమైంది. 9×9 గళ్లల్లో, తొమ్మిది 3×3 అనుబంధిత గళ్లలో ఒకటి నుండి తొమ్మిది వరకు వేసిన అంకె వేయకుండా గళ్లలో ముందే ఇచ్చిన అంకెను మార్చకుండా నింపే ఆ పద్ధతి ఇవాళ ఓ పెద్ద క్రేజ్! వాటికి పోటీలు, బహుమతులు కూడాను. ఏ గడికి ఆ గడి ఖచ్చితమైన నియమిత అంకెతోనే సుడోకు రూపొందుతుంది. 9×9 గళ్లలో పూర్తి చేయదగిన సుడోకు కాంబినేషన్స్ ఎన్ని వుండడానికి అవకాశం వుందంటే 6,670, 91, 752,021,072, 936, 960 రకాలుగా ఇవ్వవచ్చు నన్నమాట.

అయితే భారతదేశం ప్రపంచానికి కానుక ఇచ్చిన సున్న '0' సుడోకులో లేదు. ఈ అంకెల క్రీడ కన్నా భాషా, సాహిత్యాలు, ప్రపంచ పరిజ్ఞానం, కాలక్షేపానికి కాలక్షేపం, మెదడుకి చురుకు, హృదయానికి ఆనందం కలిగించే గళ్ల నుడికట్టుల వల్లనే ఎక్కువ లాభం వుందంటున్నారు. ఈ తరం పిల్లలకు మన భాషా, సాహిత్య సంస్కృతుల పట్ల అభిరుచి పెరగడానికి పదబంధ ప్రహేళికలే ఎక్కువ ఉపకరిస్తాయని అందువల్ల 'సుడోకు' కు బదులు అన్ని పత్రికలు క్రాస్‌వర్డ్ పజిల్స్‌ను ప్రోత్సహించడమే సబబనీ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఇవాళ ఇంటర్నెట్‌లో కూడా క్రాస్‌వర్డ్ పజిల్స్ చోటు చేసుకుంటున్నాయి. థింక్స్ డాట్ కామ్, క్రాస్‌వర్డ్ సైట్, పజిల్ ఎక్స్‌ప్రెస్, డైలీ కోడెడ్ క్రాస్ వర్డ్ వంటి సైట్లు వున్నాయి. 1997లో క్రాస్‌వర్డ్ వీవర్ పేర కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం అభివృద్ధి పరిచారు. తొలుత 'వర్డ్‌క్రాస్' పేరిట మొదలైన ఈ గళ్ల నుడికట్టును 1924లో సైమన్, స్కూస్టర్ వారు పుస్తక రూపంలో ప్రచురించారు. గళ్ళనుడికట్టు పుస్తకాలు ఇప్పుడిప్పుడు మన దగ్గరా విస్తృతంగా రావడం మొదలైంది.



కారూ... కప్పూ... కాదేదీ క్రాస్‌వర్డ్ పజిల్‌కనర్హం!

మన పెద్దలు... పదబంధాలు

తెలుగులో ఆరుద్ర, శ్రీశ్రీ పదబంధప్రహేళికల పట్ల పాఠకులకు ఆసక్తిని పెంచారు. ఆధారాలు ఇవ్వడంలో శ్రీశ్రీ ఆరుద్రలు చేసిన జిమ్మిక్కులు అన్నీ ఇన్నీ కావు. భాషాచమత్కారాలతో, రెండర్థాలతో, పదంలోనే సమాధానం దాగి వుండే రీతిలో, నానార్థాలు , సామెతలు, ప్రాచీన ప్రబంధ, సాహిత్యాది అంశాల పరిచితి వల్ల సాధించగలిగే రీతిలో వారు పజిల్స్ నిర్మించేవారు. "పిల్లి లేని పినతల్లి వికారంతో కూడితే గరుత్మంతుడి తల్లి" అని వినత అనే పదానికి, 'కత్తిలో తోక' అంటే 'కరవాలము'లో వాలము అని రాయడం. ఇలా వారు ఆరంభించిన చమత్కార వైఖరులను ఆపై ఎందరో అంది పుచ్చుకుని అభివృద్ధిపరిచారు.

తెలుగులో ఇప్పటికీ అత్యధిక పదబంధ ప్రహేళికలను కూర్చింది ఎవరంటే ఇతమిద్ధంగా చెప్పడం కష్టం! కానీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సుధామ, నిశాపతి, అదృష్టదీపక్, ఎన్.సురేంద్ర, ఘంటసాల నిర్మల, వాద్రేవు ఉమాశంకర్, బాలు, వాణిశ్రీ, కావూరి వెంకట సుబ్బారావు, హుమయూన్ సంఘీర్, జి.శుభాకరరావు, కె.బి.గోపాలం, ప్రదీప్, గొరుసు, వెలివల సాంబశివరావు ఇలా ఎందరెందరో కొన్ని పత్రికల్లో తమపేరు పేర్కొనకుండా కూడా మరెందరో ఈ గళ్లనుడికట్టులను నిర్మిస్తున్నారు. ఆంధ్రభూమి దినపత్రిక, నవ్య వార పత్రికల్లో పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ఆంధ్రప్రభ దినపత్రిక, వార్త (ఆదివారం), ఆంధ్రభూమి, రచన మాసపత్రికల్లో సుధామ ఆతర్వాత నిశాపతి అంతకుముందు యామినీ సరస్వతి గారు అత్యధిక సంఖ్యలో అంటే వేలాదిగా పదబంధ ప్రహేళికలను రూపొందించిన వారుగా చెప్పుకోవచ్చు. పెన్నా శివరామకృష్ణ వంటి కవులు, మణికుమారి, నిర్మల, నీరజ కూడా పదబంధాలు తయారు చేస్తారు. గతంలో గళ్ల నుడికట్టులు నిర్మించినవారు ఈ వ్యాసకర్త దృష్టిలోకి రాని వారెందరో వుండి వుంటారు. అలాగే పత్రికల్లో కాక వినోదాలు, వేడుకల కోసం, గేమ్‌షోల కోసం ఈ గళ్లనుడికట్టు పదక్రీడలు రూపొందించి అలరించేవారూ ఎందరో!

ప్రయోజనాలెన్నో

ఏమయినా ఈ గళ్లనుడికట్టు పదబంధ క్రీడలు మన భాషను, పదసంపదను పరిరక్షించుకోవడానికీ, పాఠకులలో పరివ్యాప్తం చేయడానికీ అలాగే మన సంస్కృతీ సంప్రదాయాలలోని, ఆచార్య వ్యవహారాలలోని, జానపద మధురిమల్లోని విషయ గత పదబంధాలను నిక్షిప్తపరుచుకోవడానికీ, వర్తమాన సామాజిక, రాజకీయ, చలనచిత్రాది అంశాలతో నిరంతరం సంబంధం కలిగివుండేందుకూ ఎంతగానో ఉపకరిస్తాయి.

మెదడుకు మేతగా అన్ని వయస్సులవారికీ ఉపయోగపడే శీర్షికగా పదబంధప్రహేళికలు అన్ని పత్రికల్లోనూ రాణిస్తాయి. ఎన్ని రకాల కొత్త కొత్త పజిల్స్ వచ్చినా నిర్వివాదంగా పజిల్స్ అన్నింటిలోనూ మకుటాయమానమైనది క్రాస్‌వర్డ్ పజిల్ అనే పదబంధ ప్రహేళికే. గళ్లనుడికట్టుపై పట్టు సాధించిన పాఠకుడికి కలిగే ఆనందం, విజయానుభవం వర్ణనాతీతాలు. ఈ సందర్భంగా వీటిని రూపొందించే స్రష్టలకు సమాధానాలిస్తున్న పాఠకశ్రేష్ఠులకూ ప్రజాశక్తి స్నేహాభినందనలు.

★

కొత్త పుస్తకాలు

భిన్న కోణాల 'కోనంగి'

కోనంగి (సాంఘిక నవల)
రచయిత: అడివి బాపిరాజు
వెల: రూ.150
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, అబిడ్స్,
హైదరాబాద్-500 001
ఇతర విశాలాంధ్ర బుక్ హౌస్‌లు

తెలుగు నవలా సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన ప్రముఖుల్లో అడివి బాపిరాజుది విశిష్ట స్థానం. ఆయన కేవలం రచయితే కాదు జగమెరిగిన పాత్రికేయుడు కూడా. ఆయన కలం నుంచి వెలువడిన నవలల్లో 'కోనంగి' (సాంఘిక నవల) బహుళ ప్రజాదరణ పొందింది. 1946 నాటి ఈ నవల తాజాగా మళ్లీ పాఠకుల ముంగిటకు వచ్చింది. రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యం ఉన్న కోనంగి నవల భిన్న కోణాల సమాహారం. ఇందులో హీరో పేరు కోనంగి అనగానే 'కొంటె కోనంగి' అనుకుంటాం. కథా నాయకుడు కొంతమేరకు ఇలాగే ఉంటాడు. అతని అసలు పేరు కోనంగేశ్వరరావు. కాని కోనంగిగా పాపులర్ అయ్యాడు. నవల ప్రారంభంలో కన్యాశుల్కంలోని గిరీశంలా కనిపిస్తాడు. కాని క్రమంగా ఓ ప్రేమికుడిగా, దేశ స్వాతంత్ర్యం కోసం పరితపించే దేశ భక్తుడిగా, చివరకు పాత్రికేయుడిగా కనబడతాడు. ఈ నవలలో ప్రధానమైంది కోనంగి-అనంతలక్ష్మి ప్రేమ కథ. ఈ కథతోపాటు చౌధ్రాణి-డాక్టర్ రెడ్డి, మెహరున్నీసా-రియాసత్ అలీ ప్రేమ కథలు మరో రెండు. చౌధరాణి, రెడ్డి, రియాసత్‌లీ వీరంతా కోనంగి స్నేహితులే. కోనంగి ఆర్థిక ఇబ్బందులతో చిన్నా చితక ఉద్యోగాలు చేసుకుంటూ, పోగొట్టుకుంటూ అనంత లక్ష్మి ఇంట్లో తెలుగు ట్యూటర్‌గా చేరి ఆమె ప్రేమలో పడతాడు. మనిషి సరదాగా ఉంటాడు. హాస్య ప్రియుడు. నవ్వడం, నవ్వించడం ఇష్టం. సంపన్నురాలైన అనంతలక్ష్మిపై కన్నేసిన తమిళ వ్యాపారి ఎస్‌ఎస్‌ఎస్‌జి మీనాచ్చి చెట్టియార్ ఈ నవలలో విలన్. మన తెలుగు సినిమాల్లోని కామెడీ విలన్‌లా కనబడతాడు. ఇతను తమిళ యాసతో కూడిన తెలుగు మాట్లాడుతుంటాడు. కోనంగి నవలలో అనేక కోణాలు, మలుపులు ఉన్నాయి. కోనంగి సంభాషణలు జోవియల్‌గా ఉంటాయి. తెలుగు క్లాసిక్స్‌లో ప్రముఖమైనదిగా చెప్పుకునే కోనంగి నవలలో కోనంగి-అనంతలక్ష్మి ప్రేమ కథతో సమాంతరంగా రచయిత రెండో ప్రపంచ యుద్ధ వాతావరణాన్ని, భారత స్వాతంత్ర్యోద్యమాన్ని కూడా వివరిస్తుంటారు. ఇది కొంత పాత్రల మధ్య సంభాషణ రూపంలో ఉండగా, కొంత రచయిత వివరిస్తున్నట్లుగా ఉంటుంది. కోనంగి ఒకసారి జైలుకు కూడా వెళతాడు. సొంతంగా పత్రిక పెట్టి బ్రిటిష పాలకులకు వ్యతిరేకంగా రాస్తుంటాడు. ఈ రాతలు మానుకోవాలని వారు చెప్పినా వినడు. దీని ద్వారా కోనంగి దేశభక్తి ఏమిటో అర్థమవుతుంది. కోనంగి, కమ్యూనిస్టు అయిన అతని స్నేహితుడు డాక్టర్ రెడ్డి ఎక్కువగా రెండో ప్రపంచ యుద్ధం గురించి, రాజకీయాల గురించి మాట్లాడుతుంటారు. ఇందులో కథానాయిక అయిన అనంత లక్ష్మి ఉన్నత విద్యావంతురాలు. రచయిత ఆమె వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దారు. ఈ పాత్ర చాలా హుషారుగా ఉంటుంది. కోనంగిని 'గురువుగారూ' అంటూ సరదాగా ఆట పట్టిస్తుంటుంది. నవల మొత్తం మద్రాసు (నేటి చెన్నయ్) నగరంలోనే సాగుతుంది. దీంతో తమిళ పాత్రలు కూడా కనబడతాయి. 'మద్రాసు తెలుగువారి నగరం' అని ఓ చోట రచయిత కోనంగి చేత అనిపిస్తారు. దీంతో మద్రాసుతో కూడిన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కోరికను కూడా వ్యక్తం చేసినట్లయింది. కోనంగి మధ్యలో సినిమాలో నటిస్తాడు. నవలలో చాలా చోట్ల కొన్ని భావ కవితలు, పద్యాలు ఉన్నాయి. ఒక్కోచోట పాత్రల మధ్య నాటకంలో మాదిరిగా సంభాషణలున్నాయి. ఉర్దూ కవితలు, పాటలు కూడా ఉన్నాయి. భాషలో కొద్దిగా గ్రాంథిక వాసనలూ ఉన్నాయి. మొత్తం మీద చెప్పాలంటే శైలిలో ఇది ఆధునిక అనడం కంటే ఈ కాలపు నవలకు భిన్నంగా ఉంటుందని చెప్పవచ్చు. తెలుగు నవలా సాహిత్యంపై అభిరుచి ఉన్నవారికి 'కోనంగి' నవల వెన్నెలంత హాయిగా ఉంటుంది. బాపిరాజు రచనా శైలి ఎక్కడా విసుగు తెప్పించదు. 'కోనంగి ఎంత నవ్వుతాడో, అంత ఆవేదన పడుతూ ఉంటాడు' అంటారు రచయిత ఓ చోట. నవలలో కోనంగి పాత్ర చిత్రణ ఇదే.

-ఎం. నాగేందర్

అమర గాయకుని అర్ధాంగి

అమర గాయకుని అర్ధాంగి
(శ్రీమతి ఘంటసాల సావిత్రి)
రచన : డా॥ కె.వి.రావు,
వెల : 100/-
28, 4వ ఫ్లోర్, భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
ఆర్.టి.సి క్రాస్‌రోడ్స్,
హైదరాబాద్ - 20.

'అమరగాయకుని అర్ధాంగి' అనే ఈ పుస్తకం ఘంటసాల భార్య సావిత్రి గురించి. ఒక మహనీయుడు గతించినా జనహృదయాలను ఆకట్టుకున్నవాడైనప్పుడు, ప్రజలు ఆ ప్రేమాభిమానాలను, ఆదరణనూ ఆ మహనీయుని అర్ధాంగి పట్ల చూపుకుని ఆనందిస్తారనడానికి ఈ గ్రంథం ఒక దాఖలా! ఘంటసాల సతీమణి శ్రీమతి సావిత్రిగారు ఘంటసాల మరణానంతరం మూడు పుష్కరాల కాలంగా ఎలా గౌరవాలు, ఆదరాలు పొందుతున్నారో ఆ వివరాలన్నిటినీ రచయితగా డా॥కె.వి రావుగారు గుదిగుచ్చారు. "ఘంటసాల పేరుతోబాటు నీ పేరు కూడా దేశమంతటా మారుమోగాలని ఆశించే నీ ప్రియ మావయ్య" అంటూ భార్య సావిత్రిగారికి ఘంటసాల 1972లో ఆసుపత్రి నుండి లేఖ రాశారట. 1974 ఫిబ్రవరి 11న ఆయన అస్తమించినా, నేటికీ అఖిలాంధ్ర తెలుగువారి హృదయాలలో ఆయనకున్న స్థానానికి సావిత్రిగారు సమాదరింపబడడం సంతోషదాయకమైన సంగతే! ఘంటసాల పేర జరుగుతున్న వేలాది కార్యక్రమాలూ, ఆయనకు జనం ఎదలోని సుస్థిరస్థానం చూడగులుగుతున్న ఆమె నిజంగా 'జీవిత భాగస్వామియే కాదు, కీర్తిలో జీవితానంతర భాగస్వామి కూడా కాగలగడం ఈ గ్రంథం తెలుపుతోంది.

- సుధామ

కథ

శంకర్‌గాడు బతికాడు

- బుద్ధి యజ్ఞమూర్తి

మధ్యాహ్నం మూడవుతోంది. అసైన్‌మెంట్స్ చూసుకుని అంతకు కొద్దిసేపటికి క్రితమే నేను పనిచేస్తున్న డైలీ పేపర్ ఆఫీసుకొచ్చా. సిస్టమ్ ఆన్‌చేసి, మెయిల్స్ ఏమైనా వొచ్చాయేమోనని చెక్ చేసుకుంటున్నా. ఫోనొచ్చింది. వృత్తి పరమైందనుకున్నా. కాదు. ఊర్నించి. అవతల నా హైస్కూల్‌మేట్స్‌లో ఒకడు. అతను చెప్పింది విని "నిజమా? నిజమేనా?" అడిగా ఆశ్చర్యంతోటీ, బాధతోటీ. రెండు నిమిషాలు మాట్లాడి అతను ఫోన్ పెట్టేశాడు. ఒక్కసారిగా నా మనసునిండా అంతులేని విషాదం. ఫోన్‌లో మావాడు చెప్పినే చేదునిజాన్ని... నిజమని నమ్మడానికి, జీర్ణించుకోడానికీ మనసు ఒప్పుకోవడంలేదు.

'ఒరే శంకర్‌గా, ఎందుకిట్లాంటి పని చేశావ్‌రా' అనుకుంటూ కణతలు రుద్దుకున్నా. చప్పున ఉరేసుకున్న వాడి ముఖం కళ్లముందు మెదిలింది. ఒణికిపోయా.

"శంకర్‌గాడు కొనప్రాణంతో కొట్టుకుంటున్నాడు. బతకడం చాలా కష్టమంటున్నారు డాక్టర్లు" నా క్లాస్‌మేట్ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఆటెండ్ అయిన అసైన్‌మెంట్స్‌ని ఎలా రిపోర్టు చేశానో, ఏమో తెలీదు. ఆ పని అవగానే బ్యూరో చీఫ్ కోసం చూశా. ఇంకా రాలేదు. ఫోన్ చేసి, విషయం చెప్పి రెండు రోజులు సెలవు తీసుకుని, ఆఫీసు నుండి గబగబా బయటపడ్డా. రాత్రి బస్సెక్కేముందు ఫోన్ చేస్తే, శంకర్‌ని చీరాల గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్చారనీ, కండిషన్ క్రిటికల్‌గానే ఉందనీ తెలిసింది. బస్సులో చివరివరుస సీట్. ఎత్తెత్తి కుదేస్తోంది బస్సు. అయినా శంకర్‌గాడు మనసంతా ఆక్రమించుకున్నాడు. సడన్‌గా కంటి స్క్రీన్‌మీద ప్రత్యక్షమయింది రోహిణి.... శంకర్‌గాడి భార్య. గుండెని ఎవరో మెలితిప్పినట్టయింది ఆమె జ్ఞాపకం రాగానే. వారి పెళ్లి...ఆ తర్వాత ఓసారి అనుకోకుండా వాళ్ల ఇంటికి వెళ్లడం...అక్కడ భోజనం చేయడం అన్నీ వరుసగా ఒక ఫ్రేమ్ తర్వాత మరోటిగా కదులుతూ వున్నాయ్.

❖❖❖

గొడవకి మెలకువ వచ్చింది. చూస్తే.. ఒక దాబా హోటల్ వద్ద. ప్రయాణికులంతా కిందికి దిగుతున్నారు.

నేనూ దిగి, ఆ దాబాలో టీ తాగుతున్నా.

"రోహిణీ... రోహిణీ... ఎక్కడే?" అనే కేకలకి ఉలిక్కిపడి చూశా. ముప్పై ఏళ్ల వయసున్న స్త్రీ ఎవర్నో పిలుస్తోంది.

"ఏంటి మమ్మీ. ఇక్కడే వున్నా" అంటూ ఆరేడేళ్లపాప వచ్చింది ఆమె దగ్గరకి.

"జాగ్రత్త. అటూ ఇటూ తిరక్కు. తప్పిపోతావ్" అని చిన్నగా కోప్పడింది తల్లి.

ఆ పాపవంక చూశా. బొద్దుగా, ముద్దుగా, ముచ్చటగా వుంది. నా వులికిపాటుని జ్ఞాపకం చేసుకుని నవ్వుకున్నా. అంతలోనే మనసులో బాధ సుళ్లు తిరిగింది.

'ఒరే శంకర్‌గా, ఉరేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందిరా. రోహిణి, మీ అమ్మా ఏమైపోతారనుకున్నావ్‌రా?' అని వాడిమీద కోప్పడింది హృదయం. అసలే శంకర్‌గాడి వాళ్ల నాన్న కాంతారావు రెండేళ్ల క్రితమే... వీడి పెళ్లయిన ఏడాదికే... స్ట్రోక్ వచ్చి పోయాడు. ఆయన ఫేమస్ ఫోటోగ్రాఫర్. మా ఊళ్లో మొట్టమొదటి ఫోటో స్టూడియో ఆయనదే. చీరాల్లో ఒకరివద్దనో నేర్చుకుని, కొడుకు పేరుమీద శంకర్ ఫోటో స్టూడియో పెట్టాడు. ఊళ్లో ఏ శుభకార్యం జరిగినా పిలిచేది ఆయన్నే. తర్వాతి కాలంలో పోటీగా ఇంకో కొన్ని స్టూడియోలు వెలిసినా శంకర్ స్టూడియో గిరాకీయే వేరు. నిన్న మొన్నటిదాకా స్టూడియోలో తన పాతకాలపు కెమెరాతోటే ఫోటోలు తీసేవాడు కాంతారావు. ఆ కెమెరాకి నల్లటి గుడ్డ వేలాడుతుండేది. కాంతారావు ఆ గుడ్డలోపల తలపెట్టి మా ఫ్యామిలీ ఫోటో తియ్యడం ఇప్పటికీ జ్ఞాపకమే నాకు. ఆ ఫోటోలో నా తల ఓ పక్కకి వాలి వుంటుంది. అప్పుడు నేను ఆరో, ఏడో తరగతి చదువుతున్నా. చాలాసేపు నా తలని సరిగా పెట్టాలని చూసి ఆయన ఫెయిలయ్యాడు. అయినా ఆ ఫోటోలో నేను చాలా ముచ్చటగా వున్నానని అందరూ అనేవాళ్లు. అదంతా శంకర్‌గాడి నాన్న పనితనమే.

శంకర్‌కి పెళ్లయిన రెండు మూడేళ్లదాకా కూడా ఆయనే ఎక్కువ ప్రోగ్రాములకి వెళ్లేవాడు. ఆ తర్వాత ఆ బాధ్యతని శంకర్ తీసుకున్నాడు. వాడికి చదువబ్బలేదు. టెన్త్ మూడోసారి కూడా పల్టీ కొట్టడంతో చదువు మాన్పించేసి, తనతో తిప్పుతూ పని నేర్పించాడు కాంతారావు.

హైస్కూల్లో ఆరు నుండి పదిదాకా ఇద్దరిదీ 'ఏ' సెక్షన్ కావడమే కాక, టెన్త్‌లో బెంచ్‌మేట్లం కూడా అవటాన మేమిద్దరం మంచి ఫ్రెండ్సయ్యాం. చాలామంది 'మీ ఇద్దరికీ స్నేహం ఎలా కుదిరిందిరా!' అని తెగ ఆశ్చర్యపోతుంటారు. 'బ్రిలియంట్ స్టూడెంట్'గా నాకు పేరుండడమే దానికి కారణం. శంకర్‌గాడేమో చదువులో వెరీ బ్యాడ్. స్కూల్లో అల్లరిచిల్లరగా ఉండే వాడికి ఎందుకో తెలీదు.. నేనంటే చాలా ఇష్టం. నన్ను బాగా అభిమానించేవాడు. ఎవరితోనైనా నాకు గొడవొస్తే వాడెప్పుడూ నావైపే.

పోయిన దసరాకి ఊరెళ్లినప్పుడు తెలిసింది... వాడి వ్యసనాల సంగతి. స్టూడియోకి వంద గజాల దూరంలో ఉన్న బార్లోనే ఎక్కువ టైం గడుపుతున్నాట్ట రాత్రిళ్లు. అంతకన్నా బాధ కలిగించేది వాడి పేకాట వ్యసనం. స్టూడియో మీదొచ్చే ఆదాయాన్నంతా ఆ పేకాటకే పెడుతున్నాడని పక్కనే ఉన్న మంగలి కొట్టు వీరయ్య చెప్పాడు.

"ఆళ్ల నాన్న పోయినప్పటినుండీ శంకర్ బాగా పాడైపోయాడు బాబూ. ఈ అలవాట్లు ఎట్టా అబ్బాయో, ఏమో. స్టూడియోలోనే ఆట పెట్టేత్తున్నాడు. అప్పులు కూడా చేత్తన్నాడని చెప్పుకుంటున్నారు. ఆటలో డబ్బులు పోగొట్టుకోవడం, ఆ బాధలో బ్రాందీ షాపుకుపోయి తాగడం... నా కళ్లముందు పెరిగిన కుర్రాడు... ఇట్టా ఆళ్ల నాన్న పేరు చెడగొడ్తంటే శానా బాధగా వుందయ్యా. స్టూడియోకి జనం ఇందివరకటి మాదిరిగా రావడంలేదు"

వీరయ్య చెప్పిన మాటలకి మొదట ఆశ్చర్యమూ, తర్వాత బాధా కలిగాయి. నేను వెళ్లిన టైంలో నిజానికి జనంతో స్టూడియో కళకళలాడుతూ వుండాలి. ఆ వాతావరణమే అవుపించలేదు. శంకర్‌గాడి లోనూ అదివరకటి ఉత్సాహం గానీ, చురుకుదనం గానీ లేవు. వాడి మొహం నెత్తురులేనట్లు పాలిపోయి, వాడిపోయి వుంది. వాడికళ్లు ఎరుపూ, పసుపూ కలిసిన రంగులో భయంకరంగా కనిపించాయి.

"ఏంటిరా ఈ అవతారం? ఇలా అయిపోయావేంటి? స్టూడియోలో మనుషులేరి?" అనడిగా.

"నాకేంరా. బాగానే వున్నాగా...ఇక మనుషులంటావా... ఇప్పుడు ఊళ్లో ఎన్ని స్టూడియోలున్నాయనుకున్నావ్. ఆరు. పోటీ బాగా పెరిగిపోయింది కదా" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఓ సారి అద్దంలో చూసుకోరా, నీ మొహం ఎలా వుందో, నీ కళ్లు ఎలా వున్నాయో..."

"చూసి చాలా రోజులైంది కదా. నీకలా అవుపిస్తున్నానేమోరా. నా ఆరోగ్యానికి ఢోకా అయితే ఏంలేదు"

కాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నాక "ఓ రెండొందలుంటే ఇవ్వరా. ఈసారొచ్చినప్పుడు ఇచ్చేస్తా" అన్నాడు. వాడలా నన్ను డబ్బడగటం జీవితంలో అదే తొలిసారి. వాడి పరిస్థితి నాకర్థమైపోయింది.

"దేనికిరా తాగడానికా, పేకాడ్డానికా?"అనడిగా. నిజానికి మా మధ్య ఉన్న స్నేహానికి వాణ్ణి నేనామాట అనాల్సిందికాదు. కానీ అనకుండా ఉండలేకపోయా.

వాడు దెబ్బతిన్నట్లు నావంక చూశాడు. "ఇష్టంలేకపోతే ఇవ్వొద్దులేరా" అన్నాడు బాధపడున్నట్లు.

"ఇష్టంలేక కాదురా. నిజంగా నీకు అవసరమైతేనే రొండొందలేం ఖర్మ. రెండు వేలైనా ఇద్దును. కానీ నువ్వు అడుగుతోంది నీ వ్యసనాల కోసమే కదా" అన్నా. ఈసారివాడు మాట్లాడలేదు.

'రేయ్ శంకర్‌గా, నాన్నపోయాక మరింత బాధ్యతతో కుటుంబాన్ని చూసుకోవాల్సిన వాడివి. నువ్విట్లా తాగుడికి, పేకాటకీ బానిసవైపోతే మీ వాళ్ల పరిస్థితి ఏంకాను. అమ్మెంత బాధపడ్తుంది. నిన్ను నమ్ముకుని వచ్చిన నీ భార్య పరిస్థితి ఏంటి? ఇదేనా నువ్వు ఆమెని సుఖపెట్టే పద్ధతి?" అన్నా మందలింపుగా.

ఒక్కసారిగా వాడు ఏడ్చేశాడు. చేతుల్లో మొహం దాచుకుని అలా ఏడుస్తుంటే వాడిమీద నా కోపమంతా మంచులా కరిగిపోయింది.

"ఏం చెయ్యమంటావురా. పేకాట దగ్గర కూర్చోకుండా వుండలేకపోతున్నా. బలవంతంగా ఒకరోజు ఉన్నా, రెండోరోజు తోటకాడికి నా కాళ్లు నన్ను లాక్కుపోతున్నాయి. మొదట్లో డబ్బులు వస్తున్నట్టే అనిపించింది. ఆ సంతోషంతో ఇంకా ఎక్కువ ఆడుతూ వచ్చా. డబ్బు పోగొట్టుకున్నా. పోయిన డబ్బు ఎలాగైనా సంపాయించాలని పట్టుదలగా ఆడుతున్నా. కానీ లక్ కలిసిరావడంలేదు. ఇంట్లో అమ్మకి, రోహిణికి నా మొహం చూపించాలంటే కూడా ఏదో ఇబ్బందిగా వుంటోంది. రోహిణికి నేను తగనురా. నీకప్పుడే చెప్పాను కదరా. నా వల్ల తనకి సుఖం లేదు. అందుకే ఆ బాధ మర్చిపోవడానికే తాగుతున్నా్నా" అని నిజం కక్కాడు.

✣✣✣

ఊరు ఇంకో పావుగంటలో వస్తుందనగా మెలకువొచ్చింది. వాచీవంక చూశా. ఏడవుతోంది. సెంటర్లో ఆగింది బస్సు. దిగి నడుస్తున్నా. నాలుగైదు నిమిషాల్లో శంకర్ స్టూడియో దగ్గరికొచ్చా.

వీరయ్య అప్పుడే తన షాపు తెరుస్తున్నాడు. పలకరించా. అటుతిరిగి ఉన్నవాడల్లా ఇటుతిరిగి "నువ్వా బాబూ. ఇప్పుడేనా రావడం?" అన్నాడు.

"ఆ..ఆ... ఇప్పుడే వీరయ్యా.ఎలా వుంది శంకర్‌గాడికి?"అడిగా డైరెక్టుగా.

"స్పృహలో లేడుబాబూ. నాకైతే నమ్మకం కలగట్లేదు మనిషిమీద. ఇప్పుడో, సాయంత్రమో వార్త వింటామేమో" అన్నాడు నాకోసం కింద బల్లవేస్తూ.

నేను బల్లమీద కూర్చుని, శంకర్‌గాడెందుకు ఆ పనిచేశాడని అడిగా.

"అప్పులెక్కువైపోయాయి. ఇచ్చినోళ్లు ఊరుకుంటారా... బాగా ఒత్తిడి తేవడం మొదలుపెట్టారు. దాంతో ఆటిని తీర్చడానికి కొత్త అప్పులు చేయడం, ఆఖరుకి ఎంతగా దిగజారాడంటే ఇంట్లో ఆడాళ్ల బంగారం కూడా కుదవబెట్టే కాడికొచ్చాడు పాపం. ఆ అమ్మాయికి పుట్టింటోళ్లు పెట్టిన నగలు కూడా కుదవబెట్టేశాడంట. మంచి అమ్మాయి కాబట్టి ఈయన్ని భరిత్తా, ఒక్కో నగా తీసిచ్చింది. టైమైపోయినా కుదవ డబ్బులు ఇయ్యకపోయేసరికి పెట్టుకున్నోళ్లు ఆటిని తీసేసుకున్నారు. ఆఖరికి అన్నంపెట్టే కెమెరాని కూడా అమ్మకనూకాడయ్యా. అంతకన్నా నామర్దా వుందా. ఇంట్లోవాళ్లు ఎన్నని భరిత్తారు. గొడవైంది. దాంతో ఈ పన్జేశాడు. ఈళ్లనాన్న కాంతారావుగోరు ఎంత గొప్పగా బతికాడు. ఈయనిట్టా పేరు తెచ్చుకున్నాడు. బంగారంలాంటి స్టూడియోని నాశనం చేసుకున్నాడు. ఇప్పుడేమో ఇట్టా పేనాలు తీసుకోబోయాడు. నిన్న మధ్యాహ్నం లోపల్నుంచి స్టూడియో తలుపులేసుకున్నాడు. ఎవరో ఫ్రెండు వచ్చి ఎంతసేపు కొట్టినా తలుపులు తీయలేదు. దాంతో మా అందరికీ అనుమానమొచ్చి ఎనక గోడ దూకెళ్లి చూత్తే ఏముంది? ఫ్యానుకి వేలాడ్తా కనిపించాడు. అప్పటికి కొద్దిసేపే అయిందేమో, ఇంకా కొనూపిరి వుంది. ఇంకా ఆళ్లోళ్లని బాదపెట్టాలని రాసుందేమో. పోలీసుల్ని బతిమాలి, పెద్దమనుషులతో చెప్పించి ఎట్టాగో కేసు కాకుండా చూసుకున్నాం" అని చీదరించుకున్నాడు వీరయ్య.

తన కళ్లముందే పెరిగిన వాడిగురించి అతనే అలా అన్నాడంటే శంకర్‌గాడు ఎంతగా పాడైపోయాడో అర్థమైంది. అక్కణ్ణించి ఇంటికెళ్లి తయారై చీరాల హాస్పిటల్‌కి పోయా. రోహిణి, శంకర్‌వాళ్ల అమ్మతోపాటు అత్తామామలు కూడా ఉన్నారక్కడ. శంకర్ వాళ్లమ్మలో కంటే వాడి అత్తామామల మొహాల్లోనే ఎక్కువ ఆందోళనా, విచారం కనిపించాయి నాకు. నన్ను చూశాక ఆ విచారం ఇంకా ఎక్కువైనట్లుంది.

రోహిణి మొహంలో ఏముందో తెలీడంలేదు. ఆమె చాలా నిర్లిప్తంగా, జరుగుతున్నదాంట్లో తాను చేయగలిగేదేమీ లేదనట్లుగా అనిపించింది. ఎంతగా విసిగిపోతే ఆమె అలా ఉండాలి? మనసులో ఆమె పట్ల ఓ విధమైన దిగులూ, బాధా కలిగాయి. శంకర్ వంక చూశా. వాడి మెడ చుట్టూ ఉబ్బిపోయి వుంది. నోరు కొంచెం తెరుచుకుని ఉంది. ఊపిరి చాలా బలహీనంగా ఉన్న సంగతి తెలుస్తోంది. వాడి నల్లటి మొహం పచ్చబారిపోయింది. ఆఖరి క్షణాల్లో వున్నట్టే అగుపించాడు. మనిషిగా వాడెంత దిగజారిపోయినా నా స్నేహితుడే కదా. వాణ్ణి ఆ స్థితిలో చూస్తుంటే దుఃఖం పొంగుకొస్తోంది మనసులో. బలవంతాన దాన్ని బయటకు రాకుండా ఆపుకున్నా.

చెకప్‌కి వచ్చిన డాక్టర్ వాడి పల్స్ చూసి, తల విదిలించాడు. అంటే వాడి మీద ఆశలు వదులుకోమన్నట్లే. వార్డులోంచి డాక్టరుతో పాటు నేనూ బయటికొచ్చా.

"డాక్టర్! వాడు బతికే ఆశే లేదా?"

"తొంభైతొమ్మిది పాళ్లులేవు. అతని మెదడు అచేతనంగా ఉంది. దానికి చైతన్యం వస్తే తప్ప అతను స్పృహలోకి రాడు. ఎంతకాలం అతను ఈ స్థితిలో ఉంటాడో కూడా చెప్పలేం"

"మెదడుకి చైతన్యం తీసుకురాలేమా?"

"అది మందులతో అయ్యేది కాదు. అతడికి బాగా సంతోషం కలిగించేదో లేదంటే బాగా కోపం, బాధ కలిగించేదో... ఒక సంగతి అతడి మెదడు నరాలకి చేరాలి. అప్పుడేమన్నా ఫలితం ఉండొచ్చు. అదీ గ్యారంటీలేదు. ఇటీవల ఓ మెడికల్ జర్నల్‌లో ఇలాంటి కేసుగురించి చదివిన దాన్ని బట్టి చెబుతున్నా" అని వెళ్లిపోయాడు.

నా మెదడు చురుగ్గా పనిచేసింది. శంకర్ గాడి బెడ్ వద్దకు వెళ్లా. ఆ సమయానికి ఎందుకనో రోహిణితో పాటు మిగతావాళ్లు బయటికెళ్లారు. నేను శంకర్‌గాడి తలవైపు వెళ్లి నిల్చున్నా. వాడి కళ్లు మూసుకుపోయి వున్నాయి. కానీ వాడి చెవులు తెరుచుకునే ఉన్నాయని నా నమ్మకం.

'రేయ్ శంకర్‌గా, నీ అప్పులన్నీ తీరిపోయాయ్‌రా. ఇక నువ్వు ఏ ఇబ్బందీ లేకుండా హాయిగా బతకొచ్చు. చూడు... నీ స్టూడియోకి జనం ఎల్లా వస్తున్నారో. తియ్యి.... వాళ్లని అందంగా ఫోటోలు తియ్యి" అన్నా వాడి చెవిలో.

నిమిషం దాకా వాడి మొహం వంక చూస్తూ కూర్చున్నా. వాడిలో ఏ మార్పులేదు. అలాగే ఉన్నా డు చలన రహితంగా. బలహీనమైన ఊపిరితో. నిండా అప్పుల్లో మునిగి, ఆ అప్పుల వల్లే ఉరేసుకున్న వాడికి ఇంతకంటే ఆనందకరమైన సంగతేముంటుంది? అయినా ఆ మాటలు వాడి మెదడు మీదా, ఆమెదడులోని నరాల మీదా ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయాయ్.

మరేం చెయ్యాలి? అయినా వీడిప్పుడు బతికి ఎవర్ని ఉద్ధరిస్తాడు? మళ్లీ ఆ తాగుడికీ, పేకాటకీ అంటుకుపోడని గ్యారంటీ ఏమిటి? బతికినా వీడు భార్యని, తల్లినీ సంతోషపెడతాడా? నాకు శంకర్‌గాడి మీద పీకల్దాకా కోపమొచ్చింది. వాడి గొంతు నేనే పిసికేసి చంపేస్తే... పీడా విరుగుద్ది... కోపం...కోపం... అవును... వాడికి కోపం కలిగించే సంగతి చెప్తే... ఫలితముంటుందేమో...ఆలోచన వచ్చిందే తడవు... నా మనసు మరోసారి చురుకైపోయింది. ఫ్లాష్ వెలిగిపోయింది! 'ఛ... ఛ... తప్పు' అనుకున్నా. వచ్చిన ఆలోచనకి. కానీ తప్పదు... ఇదంతా వాడు బతకడం కోసమేగా.

వాడి చెవి దగ్గర నోరు పెట్టి 'రేయ్... బతికి ఏం సాధిద్దామనిరా. నువ్వెంత తొందరగా చస్తే అంత తొందరగా రోహిణి బాధలు తీరతాయ్. నిన్ను చేసుకున్నప్పటినుంచీ ఆమెకి అన్యాయం చేస్తూనే వచ్చావ్‌రా. ఛీ.. ఏం బతుకురా నీది. ఇప్పటికైనా తనకి విముక్తి కలిగించు. చావు. తొందరగా చావరా" అన్నా ఒక్కో మాటనే ఒత్తి పలుకుతూ. పది సెకన్లు గడిచాయనుకుంటా. శంకర్‌గాడు కదిలాడు. వాడి తల కదిలింది.

మరుక్షణమే "డాక్టర్" అని కేకపెట్టా... ఆపుకోలేని సంతోషంతో!

★

నవ్వుల్ - పువ్వుల్

చూడాలనుంది

డాక్టర్ : నువ్వు ఇక రెండు గంటలు మాత్రమే బతుకుతావు. చివరిగా నువ్వు ఎవరినైనా చూడాలనుకుంటున్నావా?
పేషెంట్ : అవును చూడాలనుకుంటున్నాను.
డాక్టర్ : అయితే ఎవరిని చూడాలనుకుంటున్నావ్?
పేషెంట్ : ఒక మంచి డాక్టర్‌ని చూడాలనుకుంటున్నాను.

ఇష్టం - కష్టం

సినీ విలేకరి : మీకు బాగా ఇష్టమైన అలవాటు
ప్రొడ్యూసర్ : అప్పులు చేయడం
సినీ విలేకరి : కష్టమైనది?
ప్రొడ్యూసర్ : అప్పులు తీర్చడం.

సలహా

రంగయ్య : బస్తీకి వెళ్తున్నా! ఏం తీసుకురమ్మంటావ్?
రమణమ్మ : అంటు వ్యాధులు మాత్రం తీసుకురావద్దు.

భలేవార్త

జడ్జి : మీరు మీ భర్త నుండి విడాకులు ఎందుకు కోరుతున్నారు?
సుజాత : పెళ్లయిన కొత్తలో మా వారు నన్ను ప్రేమగా రంభ, ఊర్వశి, మేనక అని పిలిచేవారు. కానీ ఇప్పుడు పిల్లలు పుట్టాక రాక్షసి, శూర్పణక అంటున్నారు సార్.

బుద్ధి

బామర్ది : నువ్వు రికమండేషన్ చేస్తే నాకు ఏదైనా మంచి జాబ్ వస్తుంది. చేసిపెట్టు బావా ప్లీజ్!
బావ : ఇంత కాలం ఫ్రీగా రికమండేషన్లు చేయడం వల్లే చాలా మంది నా వల్ల వుద్యోగాల్లో చేరి నన్ను మర్చిపోయారు. ఇక గట్టిగా నిర్ణయం తీసుకున్నా. ఎవ్వరికీ రికమండేషన్ చెయ్యనుగాక చెయ్యను.

ఆఖరి సీను

సినీ విలేకరి : మీ సిన్మాలో ఆఖరిసీను ఎలా వుంటుంది సర్?
కొత్త సినిమా డైరెక్టర్ : సిన్మా తొలి సీనులో విడిపోయిన హీరో హీరోయిన్ కుండపోత వానలో కలుసుకుంటారు. ప్రేక్షకులకు ఆ వాన అనుభూతి కోసం...సినిమా హాళ్లలో కూడా వాన ఏర్పాట్లు చేయాలనుకుంటున్నాను.

శఠగోపం

టీచర్ : గోపీ! తలకు కట్టేంటి?
గోపి : నిన్న గుడికి వెళ్లాను. పళ్లెంలో దక్షిణ వేయలేదు. శఠగోపం పాదుకలు గట్టిగా పెట్టారు పూజారి. తల బొప్పి కట్టింది.

నాన్నకు తెలిస్తే

టీచర్ : గోపీ! నీ దగ్గర వున్న పది రూపాయలలో నేను 5 రూపాయలు అప్పు తీసుకున్నాననుకో. ఇంక నీ దగ్గర ఎంత పైకం వుంటుంది?
గోపి : ఆ విషయం మా నాన్నకు తెలిస్తే ఒప్పుకోడు. మీరు తొందరగా అప్పు తీర్చాలి టీచర్.

- జె.సుధాకరరావు పట్నాయక్, కాకినాడ.

పర్వాలేదు

నిరుద్యోగి : సార్ నాకో ఉద్యోగం ఇప్పించండి సార్.
మేనేజర్ : మా ఆఫీసులో సరిపడా ఉద్యోగులున్నారయ్యా. కొత్తగా పనులేవీ లేవు.
నిరుద్యోగి : నాకు ఉద్యోగం చాలు సార్. పని లేకపోయినా పర్వాలేదు.

ఎలా రాయాలి?

ఉపాధ్యాయుడు : నేను చెప్పే వాటిలో ఇంపార్టెంట్‌వి నోట్ చేసుకోమన్నాను కదా. ఇప్పుడు చెప్పేవి కూడా నోట్లో రాసుకోండి.
విద్యార్థి : అదేంటి సార్. నోట్లో ఎలా రాసుకుంటారు? ఇదేదో కొత్తగా వుంది. నేర్పించండి సార్.

-హనుమంతు, యూసఫ్‌గూడ.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

చిన్న కథ

తల్లి త్యాగం

"నాయనా!
ఇప్పటికే నేను చాలా రోజులు బతికాను. నేను మరెప్పుడూ సియోల్ రాను. ఒక్కసారి నన్ను చూడ్డానికి రమ్మని నిన్ను అడగొచ్చనుకుంటున్నాను. నేను నీ ప్రేమాభిమానాలకోసం ఎంతగా పరితపిస్తున్నానో తెలుసా? నువ్వు స్కూలుకు వచ్చావని తెలిసి చాలా సతోషించాను. కానీ నీకోసం స్కూలుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నాను. నాకు ఒక్క కన్నే వున్నందుకు, నిన్ను ఆ రూపంతో ఇబ్బంది పెడుతున్నందుకు నన్ను క్షమించు.

మా అమ్మకు ఒక కన్నే వుండేది. ఆమె అలా ఒంటి కన్నుతో వున్నందుకు నేను ఆమెను అసహ్యించుకునేవాణ్ణి. కానీ మా ఖర్చులకోసం ఎంతగానో కష్టపడేది. మార్కెట్ దగ్గర ఒక చిన్న కొట్టు నడిపేది.

ఆ రోజు జరిగిన సంఘటన నాకు ఇప్పటికీ గుర్తే. అమ్మ నేను చదువుకుంటున్న ప్రాథమిక పాఠశాలకు వచ్చింది. అప్పుడు ఆమెను మా స్కూలు పిల్లలు, స్నేహితులు చూశారు. ఆమె వైపు అసహ్యంగా చూచి పరుగెత్తుకుంటూ వెళ్లిపోయాను. మరునాడు స్కూల్లో...

"ఏయ్ మీ అమ్మకు ఒకటే కన్ను వుందా?" అని కొందరు పిల్లలు ఎగతాళిగా అడిగారు. అది నాకస్సలు నచ్చలేదు.

దాంతో నాకెందుకో ఒక వికృతమైన ఆలోచన వచ్చింది. అమ్మ అసలు ఈ ప్రపంచం నుంచే మాయమైపోతే బావుండుకదా అనిపించింది. అందుకే ఓసారి అమ్మను ఇలా అడిగాను "అమ్మా! నీకు రెండో కన్ను ఎందుకు లేదు?! నీవల్ల స్నేహితులు నన్ను చూసి నవ్వుతున్నారు. నువ్వు ఎందుకు చచ్చిపోకూడదు?" అనడిగాను.

దానికి అమ్మ ఏ మాత్రం స్పందించలేదు. ఆక్షణంలో నేను కొంచెం దుష్టబుద్ధితో ఆలోచించాననిపించింది. కానీ నాకు కావాల్సింది, నేను అనుకున్నది స్పష్టంగా చెప్పగలిగాననిపించింది.

అలా అన్నప్పటికీ అమ్మ నన్ను ఏమీ అనలేదు. కొట్టలేదు. బహుశా అందుకే నేను సరిగ్గానే అన్నానన్న భావన నాలో కలిగిందేమో! అదే సమయంలో ఆమెను మరీ అంతగా బాధపెట్టాననిపించలేదు కూడా.

ఆరోజు రాత్రి... నేను నిద్ర నుంచి లేచాను. వంట గదిలోకి వెళ్లి గ్లాసుతో నీళ్లు ముంచుకు తాగాను. అక్కడ అమ్మ కూర్చుని ఏడుస్తూ కనిపించింది. నేను ఆమె వైపు ఒకసారి చికాగ్గా చూచి వెళ్లిపోయాను. ఎందుకంటే ఆమెను చూచినప్పుడల్లా నా గుండెలో ఏ మూలనో ఏదో గుచ్చుకున్న భావన కలిగేది. ఒంటి కన్నుతోనే ఏడుస్తున్న అమ్మంటే నాలో వున్న అసహ్యభావంలో ఏమాత్రం మార్పు రాలేదు. అమ్మ ఒంటి కన్ను అన్నా, మా పేదరికమన్నా నాకు పరమ అసహ్యంగా వుండేది. అందుకే బాగా డబ్బు సంపాదించాలనీ, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలనీ నాకు నేను చెప్పుకున్నాను.

అప్పటినుంచి బాగా కష్టపడి చదివాను. నేను అమ్మను వదిలిపెట్టేసి సియోల్ చేరాను. అక్కడే సియోల్ యూనివర్శిటీలో చదువుకున్నాను. ఆత్మవిశ్వాసంతోనే ముందుకు నడిచాను. నాకు పెళ్లి అయ్యింది. సొంత ఇల్లు కొనుక్కున్నాను. పిల్లలు కూడా కలిగారు. ఇప్పుడు విజయగర్వంతో హాయిగా బతుకుతున్నాను. ఇప్పుడు ఈ ప్రదేశమంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే అమ్మ గుర్తులేవీ లేవిక్కడ.

ఆ సంతోషం వుండేకొద్దీ పెరుగుతూ మరింతగా పెరుగుతూ వచ్చింది. ఓరోజు తలుపు తట్టారెవరో. "ఎవరదీ...?!" అంటూ వెళ్లి చూస్తే ఏముంది?! ఎదురుగా అమ్మ... ఇప్పటికీ అదే ఒంటికన్నుతో నిలబడివుంది. అంతే...ఒక్కసారిగా మిన్ను విరిగి మీద పడినట్టనిపించింది. మా పాప అమ్మను చూచి భయంతో అరుస్తూ లోపలికి పరిగెత్తుకుంటూ వెళ్లిపోయింది.

ఏమీ ఎరగనట్టు "ఎవరు మీరు? మీరెవరో నాకు తెలీదే!!!" అనడిగా. తర్వాత నేనే మళ్లీ కలుగచేసుకొని "నీకు ఎంత ధైర్యముంటే మా ఇంటికి వచ్చి మా అమ్మాయిని భయపెడతావు? వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపో" అన్నాను.

అప్పుడు కూడా అమ్మ నిదానంగా..."ఓ... క్షమించండి బాబూ! నేను పొరపాటున మీ ఇంటికి వచ్చినట్టున్నాను" అంటూ వెళ్లిపోయింది.

"అమ్మయ్య... ఇంకా నయం అమ్మ నన్ను గుర్తుపట్టలేదు. ఇప్పుడు కొద్దిగా ప్రశాంతంగా వుంది" అనుకున్నాను. ఈ విషయాన్ని జీవితంలో మరెన్నడూ గుర్తుచేసుకోకూడదని కూడా నాకు నేను చెప్పుకున్నాను.

అలా అనుకున్నాక ఆ టెన్షన్ నుంచి విముక్తుణ్ణయ్యాను.

తర్వాత ఓరోజు నేను చదువుకున్న పాఠశాల నుంచి ఒక ఉత్తరం వచ్చింది. పాత విద్యార్థులంతా ఒకసారి కలుసుకోవాలన్నది లేఖ సారాంశం. నా భార్యకు ఏదో బిజినెస్ పని వుందని అబద్ధం చెప్పి నేను స్కూలుకెళ్లాను. ఆ కార్యక్రమమంతా అయ్యాక ఆ పాత ఇంటికి వెళ్లాను. అక్కడ అమ్మ నేలమీద పడివుంది. చేతిలో ఓ కాగితం రెపరెపలాడుతోంది. అది నాకోసం రాసిన ఉత్తరం.

ఆమె ఇలా రాసింది:

"నాయనా!

ఇప్పటికే నేను చాలా రోజులు బతికాను. నేను మరెప్పుడూ సియోల్ రాను. ఒక్కసారి నన్ను చూడ్డానికి రమ్మని నిన్ను అడగొచ్చనుకుంటున్నాను. నేను నీ ప్రేమాభిమానాలకోసం ఎంతగా పరితపిస్తున్నానో తెలుసా? నువ్వు స్కూలుకు వచ్చావని తెలిసి చాలా సతోషించాను. కానీ నీకోసం స్కూలుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నాను. నాకు ఒక్క కన్నే వున్నందుకు, నిన్ను ఆ రూపంతో ఇబ్బంది పెడుతున్నందుకు నన్ను క్షమించు.

కానీ బాబూ... నువ్వు చాలా చిన్న పిల్లాడిగా వున్నప్పుడు ఒక యాక్సిడెంట్ అయింది. అందులో నీ కన్ను ఒకటి పోయింది. ఒక తల్లిగా అది చూడలేకపోయాను. నా కన్ను ఒకటి నీకు ఇచ్చాను. నా కంటితో నువ్వు ఈ సువిశాల ప్రపంచాన్నంతా చూస్తున్నందుకు నాకు ఎంతో సంతోషంగా వుంది.

నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను బాబూ. నువ్వే నా ప్రపంచం.

నా ప్రపంచం ముక్కలైపోయింది!!!

అంతే...నాకోసమే బతికిన మా అమ్మ కోసం ఎంతగానో ఏడ్చాను.

(ఇంటర్నెట్‌లో విస్తృతంగా ప్రచారంలో వున్న కథకు ఆంధ్రానుసరణ)

★

బుస్...బుస్

చేసేద్దాం

పిడుగులూ... మీకు పాములంటే కూడా భయం లేదటగా. అందుకే ఇవాళ మీ ముందుకు ఒక కోబ్రా వచ్చింది. ఇది ఐస్‌క్రీమ్ పుల్లలతో చేసిందే. దాన్ని మీరు ఎలా చేయాలో చెప్పుకుందామా. మరైతే ఏమేం కావాలో ఎలా చేయాలో చెప్పుకుందాం.





ఏమేం కావాలంటే...

ఐస్‌క్రీమ్ పుల్లలు
సన్నటి సీలలు/బెండ్ వైర్,
తెల్ల కాగితం
పెన్ను
గమ్

ఎలా చేయాలంటే...

మనకు ఎంత పెద్ద పాము కావాలంటే అన్ని ఎక్కువ ఐస్‌క్రీమ్ పుల్లలను ఉపయోగించాలి. ముందుగా ఐస్‌క్రీమ్ పుల్లలకు రెండు చివరలా రెండు రంధ్రాలు పెట్టాలి. అవసరమైతే ఇందుకోసం పెద్దల సాయం తీసుకోవచ్చు. లేదంటే .. ముందుగా ఈ పుల్లలను 10-15 నిముషాల పాటు నీళ్లల్లో నానబెట్టండి. ఇప్పుడు పాత బాల్‌పాయింట్ పెన్నుతో (చాలా కాలంగా వాడకుండా పడేసింది) పుల్లలమీద గుచ్చి రంధ్రం చేయండి. ఐస్‌క్రీమ్ పుల్లలు చీలకుండా వుండాలంటే.... జాగ్రత్తగా వుండాలి సుమా. ఇప్పుడు ఐస్‌క్రీమ్ పుల్లలను ఆంగ్ల అక్షరం ఎమ్ ఆకారంలో పెట్టాలి. తర్వాత వీటిమీద ఆంగ్ల అక్షరం డబ్ల్యు ఆకారంలో మళ్లీ పుల్లలు పెట్టాలి. ఇప్పుడు బైండ్ వైర్‌ని ఉపయోగించి బొమ్మలో చూయించినట్టుగా రెండేసి పుల్లలను కలుపుతూ బైండ్ వైర్‌తో ముడి వేయాలి. లేదా సీలలు కొట్టాలి. కొంచెం లూజ్‌గా వుంటేనే పామును ముందుకూ వెనక్కూ కదిలించడానికి వీలవుతుంది. ఇంక తెల్లటి పేపర్ తీసుకొని పాము తల తయారుచేయాలి. దీనిమీద పాము నెత్తిమీద వుండే గుర్తుకూడా పెన్నుతో వేసుకోవాలి. దీన్ని ఇందాక మనం తయారుచేసుకున్న పుల్లల స్టాండు తల భాగంలో అతికించాలి. వెనకవైపు పుల్లలను దగ్గరకు చేసి చూడండి. పాము పొడవుగా అవుతుంది. అదే వాటిని దూరం చేస్తే పాము చిన్నగా అవుతుంది. బావుందా కోబ్రా. మరైతే ఎందుకంట... స్నేహితుల ముందు ప్రదర్శన పెట్టండి.



ఏమేం వున్నాయి?

పిల్లలూ! ఇక్కడ కనిపిస్తున్న విచిత్రమైన ప్రాణిని చూడండి. ఇందులో ఒకటి కాదు...ఏకంగా నాలుగు ప్రాణుల శరీర భాగాలున్నాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం. మీరు ఎన్నిటిని చెప్పగలిగితే అన్ని మార్కులొచ్చినట్టు.

కారులో షికారు

కారులో షికారుకెళ్లే జిరాఫీకి రంగులు అద్దేద్దాం. అందంగా తయారుచేసేద్దాం.

ఇల్లు చేరేదెలా?

బుజ్జాయిలూ ఇక్కడో పురుగు తాతగారున్నారుగా. అదేన్రా గుమ్మడికాయ కింద వున్నారుకదా. ఆయన తన ఇంటికెళ్లాలి. అయితే బోలెడన్ని గజిబిజి దారులు. ఎలా వెళితే తిన్నగా ఇల్లు చేరతాడో. కాస్త సాయం చేయొచ్చుకదా.



డాల్ఫిన్ ఎక్కడ దాగింది?

చిన్నారులూ... ఈ గులాబి బాల ఎంత బావుందో కదా. ఇందులో ఒక డాల్ఫిన్ దాక్కుందర్రా. ఇంతకీ అది ఎక్కడ నక్కిందో చెప్పుకోండి చూద్దాం.



కుందేలును అతికిద్దాం

నేస్తాలూ... ఇక్కడ ఓ కుందేలు వుండాలి. కానీ మెజీషియన్ మాయం చేసేశాడు. మరలా తిరిగి తీసుకురావాలంటే మాత్రం ఒక ట్రిక్కు చెప్పాడు. ఆ పక్కనే వున్న ముక్కలను అతకబెడితే కుందేలు వస్తుందన్నాడు. మరి ఆ ప్రయత్నం చేయొచ్చుకదా. అలా చేయాలంటే ముందు ఆ ముక్కలను కత్తిరించాలి. తర్వాత అతికించాలి. రెడీనా.

భార్యలను వెతుక్కుంటూ...

హాయ్ చిన్నారులూ... ఇక్కడ చాలామంది పాలకులున్నారు. ఓసారి ఏమైందంటే వారి భార్యలంతా కలిసి ఓచోట దాక్కున్నారు. వీరేమో వారికోసం వెతుకులాట మొదలెట్టారు. ఇంతకీ వారు ఎక్కడ దాక్కున్నట్టు? ఆ గళ్లలో వున్నారేమో చూడండి. అన్నట్టు మీరు ఎవరి భార్యలకోసమైతే వెతకబోతున్నారో వారి పేర్లు తెలియాలికదా. మరైతే చదవండీ...

1,Badshah, 2.Dauphin, 3.Duke, 4.Earl, 5. Emir, 6. Emperor, 7.Kaiser, 8.Knight, 9.Marquess, 10.Sultan, 11.Tsar, 12.Viceroy.

A	E	N	I	H	P	U	A	D	B	M
G	F	C	S	U	L	T	A	N	A	C
B	B	D	F	C	F	C	E	R	F	D
E	E	N	I	E	R	E	C	I	V	C
G	M	X	E	Z	B	H	G	A	B	A
U	P	A	K	A	I	S	E	R	I	N
M	R	A	D	O	R	E	D	G	A	I
Z	E	Y	N	B	X	I	E	C	P	R
A	S	E	U	D	E	P	M	G	D	A
C	S	R	C	O	U	N	T	E	S	S
S	S	E	H	C	U	D	Y	B	E	T

జవాబు:
1.Begum,
2.Dauphine,
3.Duchess,
4.Countess,5.Emira,
6.Empress,
7.Kaiserin,
8.Dame,
9.Marchioness,
10.Sultana,
11.Tsarina,
12.Vicereine.

మాటల కోట - 12

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2		■	3	■	4	5	6
7		■	8		9	■	10	
	■	11				12	■	
■	13		■		■	14	15	■
16		■	17	■	18	■	19	
■	20	21	■	22	■	23		■
24	■	25	26		27		■	28
29	30	■	31			■	32	
33			■		■	34		

నిలువు :

1. తీవ్రమైన కోపం (3)
2. ఉష్ణము, వేడి (2)
3. ప్రస్తుతం (4)
5. కింద నుంచి చూస్తే రాసే ద్రవం. పై నుంచి రాస్తే కుప్ప (2)
6. గాలి సోదరులు దీన్ని తవ్వి రోజుకు కోట్ల సొమ్ము పోగేసుకుంటున్నారు. అన్నట్లు ఇది జీవుల్లో విధిగా ఉండాల్సిందే (3)
8. వినబోమని తేల్చి చెప్పండి (2)
9. కింద నుంచి తీవ్రమైన కోరిక (2)
11. సముద్రం కాదు. తీపినీటి ప్రవాహమే (2)
12. కింద నుంచి ఉచితంగా చేసేది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిని ఇలానే పిలుస్తారు (2)
13. భూగర్భపు గొయ్యి (3)
15. సిగ్గు కలిగిన(ది)వాడు (3)
21. మరం కాదు హకారంతో కిందనుంచి మొండితనం (2)
22. భూతం ఉంటుందిగానీ, వాస్తవానికి అది గడచిన సమయం (4)
23. చెట్ల సమూహం (2)
24. చదువురాని వాడని దిగులు చెందకు (3)
26. కిందనుంచి విరిసేది, పూవు (2)
27. కోరికను తీర్చేది (2)
28. తగినంతగా లేని, సన్నని (3)
30. ఇదో జబ్బు అయితే దారి మార్చింది మరి (2)
32. వాడిని పొమ్మని కేక పెట్టండి (2)

అడ్డం

1. ఆంధ్రకేసరి పేరిట ఏర్పడిన జిల్లా. కాంతి (3)
4. అణు పరిశోధన చేస్తోందంటూ అటు నుంచి ఇటు అమెరికా బెదిరిస్తున్న దేశం (3)
7. చీర (2)
8. దారి మార్చిన ప్రవర్తనే (3)
10. కాలిన తర్వాత వచ్చేది తిరగబడింది, బూడిద (2)
11. ఆకాశ ప్రయాణం ఎటెటో సాగింది (5)
13. వంద పప్పు అని ఇటీవల పాడు పేరు తెచ్చుకున్న విత్తు (2)
14. బానిస స్త్రీ, పనిగత్తె (2)
16. వ్యవసాయంలో వాడే ఎదకు అసలు రూపం (2)
17. అవి మొత్తం అరవై నాలుగు. ఇక్కడ మాత్రం ఏకవచనంలో మొదటిసగం (1)
18. అడ్డం 17 కి రెండో సగం (1)
19. అటునుంచి ఇటు వచ్చిన పూవుకు పూర్వ స్థితి. (2)
20. రెండు పూర్ణాలున్న గొంతుక (2)
23. బియ్యానికి మాతృక (2)
25. పచ్చటి తోట (5)
29. నూరులో భాగాన్ని తేల్చే లెక్క (2)
31. సక్రమ ఆకారం కాదు. వికృత రూపం (3)
32. ఉద్యమం (2)
33. మృతులకు, పెద్దలకు మనస్సుతో అర్పించేది (3)
34. ఏమరుపాటు (3)

మాటలకోట - 11 జవాబు

1 అ	2 రు	3 గు	■	4 అ	■	5 నా	6 గ	7 లి
8 కా	వే	రి	■	ర	■	9 రు	బు	క
10 లం	బ	■	■	వో	■	■	11 త	రో
■	■	■	12 నె	ళ్లు	13 మ	■	■	■
14 దం	రం	క	మ	■	15 ర	క్ష	కు	డు
■	■	■	16 రు	17 కు	పు	■	■	■
18 పం	19 ట	■	■	తూ	■	■	20 పా	21 త
22 ది	ము	23 న	■	హ	■	24 ఉ	యం	పా
25 రి	కు	డి	■	లం	■	26 మ	అ	ర

ఇద్దరు గొప్ప చిత్రకారులు

ఒకానొకప్పుడు గ్రీసు దేశంలో జ్యూగ్జిస్ అనే ప్రఖ్యాత చిత్రకారుడు వుండేవాడు. ఆయన ముఖ్యంగా పళ్లు, పూలు చిత్రించేవాడు. చాలాసార్లు ఆయన చిత్రాలను చూసిన వాళ్లు నిజంగానే అక్కడ ఆయా పళ్లు, పూలు వున్నాయనే భ్రమించేవాళ్లు.

ఒకసారి ఆయన కొన్ని యాపిల్ పళ్లను చిత్రించాడు. అవి ఎంత నిజమైన వాటిలా వున్నాయంటే కొన్ని పక్షులు ఆ చిత్ర పటం వున్న గదిలోకి వచ్చి ముక్కుతో వాటిని పొడవసాగాయి. అది చూసిన వాళ్లు "నువ్వు అద్భుతమైన చిత్రకారుడివి" అంటూ ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. దాంతో ఆయనకు గర్వం అతిశయించి 'ఈ ప్రపంచంలో నాఅంత గొప్ప చిత్రకారుడు ఎవరూలేరు' అనుకున్నాడు.

అదే దేశంలో ప్యారేషియస్ అనే మరో చిత్రకారుడు వున్నాడు. అతను కూడా గొప్ప చిత్రకారుడే.

ఒకసారి జ్యూగ్జిస్ "ఈ ప్రపంచంలో నేనే అత్యుత్తమ చిత్రకారుణ్ని. నాలాగా ఎవరూ చిత్రించలేరు" అనటం విన్నాడు. "నేను అందమైన పటం గీస్తా. అది చాలా ప్రత్యేకంగా వుంటుంది. దాన్ని చూసి జ్యూగ్జిస్ ఏమంటాడో చూడాలి" అనుకున్నాడు.

ఒక బాలుడు ఒక తెర వెనకాల నిల్చుని వున్నట్లుగా చిత్రించాడు ప్యారేషియస్. ఆ తెర నిజంగా అల్లిన తెరలాగే వుంది.

అప్పుడు జ్యూగ్జిస్‌ను తన ఇంటికి ఆహ్వానించి తాను చిత్రించిన పటాన్ని చూసి ఆయన అభిప్రాయం చెప్పమని అడిగాడు.

జ్యూగ్జిస్ ఆ పటాన్ని చూస్తూ "కొంచెం ఆ తెర తొలగిస్తే అప్పుడు స్పష్టంగా చూసి నా అభిప్రాయం చెప్పగలుగుతా" అన్నాడు.

ప్యారేషియస్ నవ్వి "మిత్రమా! అది నిజమైన పరదా కాదు" అన్నాడు.

జ్యూగ్జిస్ సిగ్గుతో తల వంచుకున్నాడు. "నువ్వే నా కన్నా గొప్ప చిత్రకారుడివి. పక్షులు నా చిత్రాన్ని చూసి నిజమైనవిగా భ్రమించాయి. కానీ నేనొక చిత్రకారుణ్ణి అయివుండి నువ్వు చిత్రించిన తెరను నిజమైనదని భ్రమించాను. నేను గుణపాఠం నేర్చుకున్నాను. ఇక నుంచి ఏమాత్రం గర్వంగా వుండను" అన్నాడు.

కొన్ని వారాల తర్వాత జ్యూగ్జిస్ ఒక చేత్తో ద్రాక్ష పళ్లగుత్తిని ఎత్తి పట్టుకున్నట్లుగా చిత్రించాడు. మళ్లీ దాన్ని పక్షులు రివ్వున వచ్చి ఆ పటం మీద వాలి ఆ పళ్లను పొడవసాగాయి. అది చూసి జ్యూగ్జిస్ బాధ పడ్డాడు.

"ఎందుకంత బాధపడుతున్నావు. నువ్వు చిత్రించిన పళ్లను నిజమైనవిగా భావించి ముక్కులతో పొడుస్తున్నాయి కదా?" అన్నాడు ప్యారేషియస్.

"అవును నిజమే. కానీ పక్షులు నిజమైన పిల్లవాణ్ణి చూస్తే భయపడతాయి. కానీ ఈ పక్షులు ఆ పిల్లవాణ్ణి చూసి ఏమాత్రం బెదరడం లేదు. బహుశా నేను చిత్రించిన పళ్లు మాత్రమే నిజమైన వాటిలా వుండి, బాలుడు నిజమైన బాలుడిలా లేడన్నమాట" అన్నాడు జ్యూగ్జిస్.

- మేకల మదన్ మోహన్ రావు








చూడానందమే!

ఆహా! కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయ్! ఇక్కడ కనిపించే పుడ్డు, బ్రెడ్డు-పళ్లు, గుడ్డును ఓ పట్టు పట్టేద్దాం అనుకుంటారేమో. అదేం కుదరదు. అన్నీ అలా చూడ్డానికే. తినడానికి పనికి రావు. కళాపోషణ పుష్టిగా వున్న వారి సృష్టి ఈ చిత్రరాజాలు. తినుబండారాల్లోనే హాలీవుడ్ తారలు, రాజకీయ నేతలు, ప్రముఖుల మొహాలను అమర్చేశారు. ఎవరిని మెచ్చుకోవాలి? వారి సృజననా! వాటిని అందించిన మమ్మల్నా!! మీరే తేల్చుకోండి. మరీ ఎక్కువ సమయం తీసుకోకండే.